

ర్యాలీలో జనసేన జెండా పట్టుకుని పవన్ అభివాదం



పవనోత్సాహం

కదిలొచ్చిన జనసేన : చేబ్రోలు వద్ద జాతీయ రహదారిపై కిక్కిరిసిన జనసైనికుల ర్యాలీ

ఇదీ మన గుర్తు

కూటమి అభ్యర్థిని : మూడు పార్టీల కండువాలతో పవన్

పిఠాపురాన్ని ఆదర్శంగా చేస్తా..

- అన్నీ ఉన్నా పిఠాపురం అభివృద్ధి కాలేదు
- గెలిచి సమస్యలన్నీ పరిష్కరిస్తా
- మత్స్యకారులకు అండగా ఉంటా
- వైసీపీ అభ్యర్థి గీత వస్తే నిలదీయండి
- ఉప్పాడ సభలో జనసేనాని పవన్

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/యు.కొత్తపల్లి, ఏప్రిల్ 23: నియోజకవర్గం అంటే ఇలా ఉండాలి. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అనేలా పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా పవన్ మంగళవారం ఉప్పాడ సభలో ప్రసంగించారు. ఉప్పాడ బీచ్‌ను అత్యంత సుందరంగా చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ఒకపక్క సముద్రం, మరో పక్క వ్యవసాయం, సెజ్, పోర్టులు అన్నీ ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గెలిచిన తర్వాత అన్ని రంగాల్లోను పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. 20 వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే హార్బర్‌ను వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయకుండా మోసంచేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పెంపు, వలలు, ఇంజన్లకు సబ్సిడీ దగ్గర నుంచి హార్బర్ పూర్తి వరకు చేసి చూపిస్తామన్నారు. సముద్రపు కోత నివారణకు నిపుణులతో అధ్యయనం చేయిస్తామన్నారు.కాకినాడ సెజ్ బాధితుల బాధలను చూసి రాజకీయాల్లోకి రావాలనుకున్నట్టు చెప్పారు. వారికి అన్ని విధాలా న్యాయం జరిగేలా తాను చూస్తానన్నారు. అరబిందో, దివీస్‌పై పోరాటంలో ముందుంటానన్నారు. కష్టంలో ప్రతి ఒక్కరి భుజం కాస్తానన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వైసీపీ ఏంచేసిందని ప్రతి ఒక్కరు ప్రశ్నించాలన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గీతను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి సునీల్ రాత్రుళ్ల తిరగడం కాదు.. పగలు తిరగాలని చురకలంటించారు. ఉప్పాడ చీరలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించేలా చేస్తానన్నారు. చేనేత కార్మికులు పస్తులుండకుండా వారికి న్యాయం చేస్తానని తెలిపారు. తనను అసెంబ్లీకి చిన్న మెజార్టీతో కాకుండా భారీ మెజార్టీతో పంపాలని కోరారు. తన నామినేషన్‌కు నియోజకవర్గవ్యాప్తంగా వేలల్లో తరలివచ్చిన ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండి భుజం కాస్తానన్నారు. రిలయన్స్‌జీఎస్‌పీసీ, ఓఎన్జీసీ కంపెనీల నుంచి పరిహారం అందేలా చేస్తానన్నారు. తుఫాన్ షెల్టర్లను ఆధునికీకరిస్తామని,అరబిందో ఫార్మా వ్యర్థజలాలు సముద్రంలో కలవకుండా పోరాడతానన్నారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి..

పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పవన్ వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వర్మను చట్టసభల్లోకి పంపి ఆయనకు తగిన గౌరవం లభించేలా చేసే బాధ్యత తనదన్నారు. 'పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సీటును నా కోసం త్యాగం చేశారు. ఆయనకు నా కృతజ్ఞతలు, నమస్కారాలు తెలుపుతున్నా. భవిష్యత్తులో ఆయన ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరుకుంటున్నా. దానికి నా కృషి కూడా ఉంటుంది' అని పవన్‌కల్యాణ్ తెలిపారు. నామినేషన్‌కు భారీగా టీడీపీ శ్రేణులు రావడం ఆనందంగా ఉందన్నారు.కలిసి పనిచేయడంతో విజయం సాధించడం సులువని పేర్కొన్నారు. వర్మతో పాటు మరికొందరు నేతలను పవన్ ఆలింగనం చేసుకున్నారు.తమది మూడు పార్టీల హామీ అని, జగన్‌లా ఒక పార్టీ హామీ కాదన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశాలతో పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.ఆయన స్థానికేతరుడని వైసీపీ ఆరోపిస్తున్నా రాష్ట్ర అధ్యక్షుడు ఎక్కడి నుంచైనా పోటీచేస్తారన్నారు.ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థిని వంగా గీత ఐదేళ్లలో ఏరోజు పిఠాపురం రాలేదని ధ్వజ మెత్తారు. అనంతరం ఉప్పాడ సెంటర్ నుంచి గోర్స, కొమరగిరి మీదుగా పిఠాపురం- గొల్లప్రోలు బైపాస్ మీదుగా చేబ్రోలులోని తన ఇంటికి పవన్ చేరుకున్నారు.



పవన్ నామినేషన్ దాఖలు



ఉప్పాడ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న పవన్, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, వర్మ, కృష్ణంరాజు

కదిలిన..జనసేన

పిఠాపురం/రూరల్/గొల్లప్రోలు,ఏప్రిల్23: జన కెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. అడుగడుగునా యువత, మహిళలు, ప్రజలు నీరాజనాలు పలికారు. హారతులు పట్టారు. పూలవర్షం కురిపించారు. వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, బీజేపీ కేడర్‌తో కలిసి భారీ ర్యాలీతో తరలివచ్చి పవన్‌కల్యాణ్ నామినేషన్ దాఖలు చేశారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం చేపట్టిన ర్యాలీకి అపూర్వ స్పందన లభించింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి పవన్ బయలుదేరి చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నుంచి 216వ జాతీయ రహదారిపై చెందుర్తి, తాటిపర్తి జంక్షన్ల మీదుగా గొల్లప్రోలు పట్టణంలోని బైపాస్ వై.జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్ వద్దకు చేరుకుని తిరిగి గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయ సెంటర్‌కు వచ్చారు. భారీ జనసందోహం మధ్య ర్యాలీని ప్రారంభించారు. చేబ్రోలు నుంచి గొల్లప్రోలు వరకూ ఓపెన్‌టాప్ కారులో పవన్ వచ్చారు. ఓపెన్‌టాప్ జీపులో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగబాబు ఉన్నారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు గొల్లప్రోలు టోల్‌ప్లాజా మీదుగా పిఠాపురంలోకి ర్యాలీ ప్రవేశించింది. ర్యాలీ పొడవునా ప్రజలకు పవన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మహిళలు పూలవర్షం కురిపించారు. పలుచోట్ల మహిళలు హారతులిచ్చారు. పిఠాపురంలోని కోర్టులవద్ద న్యాయవాదులు, పశువుల సంతవద్ద రెల్లి కులస్థులు స్వాగతం పలికారు. పిఠాపురంలో కిలోమీటరు మేర రోడ్‌షోకే గంటకు పైగా సమయం తీసుకుంది. సమయం మించిపోతుండడంతో సాయిబాబా గుడి సెంటర్‌లో వేరొక వాహనంలో పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని పవన్ నామినేషన్ దాఖలు చేశారు. పవన్ ర్యాలీ సాగిన 216వ జాతీయ రహదారితో పాటు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణ రోడ్లన్నీ జనసునామీని తలపించాయి. కిలోమీటరున్నర పొడవునా మోటార్‌సైకిళ్లు, కార్లు, ఇతర వాహనాల్లో జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కేడర్ అనుసరించారు. 14 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. పవన్‌కల్యాణ్ చేబ్రోలు నివాసం నుంచి నామినేషన్ వేసేందుకు బయలుదేరుతున్న సమయంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి హారతులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పార్టీ నేత నాగబాబు ఆశీస్సులు అందించారు. బ్రాహ్మణులు ఆశీర్వచనాలు పలికారు. క్రైస్తవ సోదరిమణులు దీవెనలు అందజేశారు.



విజయీభవ : పవన్‌ను ఆశీర్వదిస్తున్న నాగబాబు, వర్మ దంపతులు



ఇది మన జెండా..



ర్యాలీలో భాగంగా పవన్ అభివాదం



ఆదిరెడ్డి శ్రీనివాస్ తరపున నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే భవాని

ఉమ్మడి తూర్పుగోదావరిలో 91 నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఐదో రోజైన మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 91 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో లోక్‌సభలకు 14, అసెంబ్లీలకు 77 ఉన్నాయి.

'తూర్పు'లో లోక్‌సభకు 4, అసెంబ్లీ స్థానాలకు 25 నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభకు నాలుగు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 25 నామినేషన్లు మంగళవారం దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా మెడిసి రత్నారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ తరపున ఆయన ప్రతిపాదకుడు, బీఎస్పీ అభ్యర్థిగా పరమట గణేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా కుర్రెళ్ల భానుచందర్ నామినేషన్లు దాఖలు చేశారు. అనపర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తరపున తేతలి అబ్బుస్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా ఎన్.ప్రవీణ్‌కుమార్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ సదర్ హుస్సేన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున వై.శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలుచేశారు. రాజానగరం నియోజకవర్గం నుంచి భారత చైతన్య యువజన పార్టీ తరపున జక్కంపూడి సత్తిబాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరపున ముండ్రు వెంకటశ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు తరపున, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తరపున మార్గాని సురేష్, బీఎస్పీ అభ్యర్థిగా పరమట సురేఖ నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బాలేపల్లి మురళీధర్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా మెల్ల కమల ఉరఫ్ ఆరుగొలను కమల, ఉబా శ్రీకాంత్, బొంతా కిశోర్, కొక్కిరిపాటి చినబాబు నామినేషన్లు దాఖలుచేశారు. నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా కందుల లక్ష్మీదుర్గేష్ ప్రసాద్ తరఫున ప్రశాంత్ శ్రీనివాస్, బీఎస్పీ అభ్యర్థులుగా జి.చిత్రసేను, బయ్యే మునేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. గోపాలపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకటేశ్వరరావు, పెనుమాక వినోదకుమారి, బీఎస్పీ అభ్యర్థిగా సిర్రా భరతరావు, స్వతంత్ర అభ్యర్థిగా దొడ్డిగర్ల నాగార్జున నామినేషన్లు దాఖలు చేశారు.

అమలాపురం లోక్‌సభ స్థానానికి బోణీ

అమలాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఐదో రోజైన మంగళవారం అమలాపురం లోక్‌సభ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు సమర్పించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షుశుక్లా తెలిపారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) తరపున బూసిం రమణమ్మ ఒక సెట్, వైసీపీ తరపున రాపాక వరప్రసాదరావు రెండు సెట్‌లు, లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ తరఫున యడ్ల రాజేష్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఇసుకపట్ల ఇమ్మానియేల్ కుమార్ ఒక సెట్, బహుజన సమాజ్ పార్టీ తరపున యాళ్ల దొరబాబు రెండు సెట్‌లు, స్వతంత్ర అభ్యర్థిగా గుడే వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు,

కాకినాడ లోక్‌సభకు పల్లంరాజు నామినేషన్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్23: కాకినాడ జిల్లాలోని కాకినాడ లోక్‌సభ స్థానానికి ఆరు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 26 నామినేషన్లు మంగళవారం దాఖలయ్యాయి. కాకినాడ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లిపూడి మంగపతి పల్లంరాజు నాలుగు సెట్లు దాఖలు చేయగా.. స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందిన మరో ఐదుగురు అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

ఇది జగన్ బ్రాండ్ కథ..



గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీల్లో మరొక నవరత్నం.. మద్య నిషేధం. టీడీపీ హయాంలో మద్యం ఏరులైపోరుతోందని, తాను మద్యం నిషేధం అమలుచేసి ఆయా కుటుంబాల్లో సంతోషం నింపుతానని పాదయాత్ర సందర్భంగా జగన్ పదేపదే చెబుతూ వచ్చారు. కానీ జరిగిందేంటి?...

గత ప్రభుత్వంలో రూ.60 ఉన్న చీప్‌లిక్కర్ రూ.120కి చేరింది. ఇప్పుడు రూ.150 చేసింది. నిజానికి కాయకష్టం చేసుకునే పేదవర్గాలంతా తాగే మందు ఇదే. కాస్త బ్రాండ్ మద్యమైతే రూ.120 నుంచి రూ.220కి చేరింది. దాంతో మందుబాబులంతా అల్లాడిపోయారు. సంపాదించిన సొమ్మంతా మందు కొట్టుకే అప్పజెప్పారు. ఇదేంటని నిలదీస్తే, మద్య నిషేధం కోసమే తాము రేట్లు పెంచామని వైసీపీ సర్కార్ సరికొత్త భాష్యం చెప్పింది. ఇదేం తెలివి.. ఉన్న సొమ్మంతా మద్యానికే యజమాని పోస్తున్నాడని మహిళలూ గగ్గోలు పెట్టారు. ప్రభుత్వం మాత్రం బడుగు జీవులకు నాణ్యత లేని మద్యం పోసి వందల కోట్లు లాగేసింది.

ఇక బ్రాండ్ల బాగోతం. దశాబ్దాల తరబడి ఉన్న బ్రాండ్లన్నీ మాయమయ్యాయి. బూంబూం అంటూ బీర్, ఏవో రకరకాల పేర్లతో చీప్ లిక్కర్, చివరకు ఖరీదైన మద్యంలోనూ 'జే' బ్రాండ్ల మద్యం.. చీప్ లిక్కర్ తాగిన వారంతా జగన్‌ని తిట్టని రోజు లేదు. పచ్చి మందు తెచ్చి తమ ప్రాణాలు హరిస్తున్నారంటూ మద్యపానీయులంతా గగ్గోలు పెట్టని ఊరు లేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన మత్తు వ్యాపారం మరొకటుంది. కాలేజీ పిల్లల నుంచి ఏదొక పనిచేసుకునే యువకుల వరకు ఇప్పుడు గంజాయి మత్తులో జోగుతున్నారు. ఇది మన గోదావరి జిల్లాల్లో ఇప్పటికే చుట్టుముట్టేసింది. మన పిల్లల భవిష్యత్తుని ఛిద్రం చేసే దిశగా తీసుకెళ్లిపోతోంది. దీని వెనుక ఎవరున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అటు కాకినాడలోను, ఇటు రాజమహేంద్రవరంలోనూ గంజాయి వ్యాపార వ్యవహారాల్లో వైసీపీ నేతల అండదండలుండడం బహిరంగ రహస్యమే.



- నాడు మద్య నిషేధమంటూ జగన్ హామీ
- లేకపోతే 2024లో ఓట్లు అడగనని ప్రతిన
- నాలుగు రెట్లు పెంచి పేదలను పీల్చేసిన వైనం
- 'జే' బ్రాండ్ల మద్యంతో అనారోగ్యం
- మళ్లీ నాటుసారా వైపు మళ్లిన కష్టజీవులు
- ఉమ్మడి జిల్లాల్లో విచ్చలవిడిగా గంజాయి
- ఈ మత్తు సామ్రాజ్యం వెనుక వైసీపీ నేతలు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కాకినాడ సిటీ/పిఠాపురం/ఆత్రేయపురం: గత అసెంబ్లీ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీల్లో దశల వారీగా మద్య నిషేధం ఒకటి.2019 మే 26న తన ప్రమాణ స్వీకారానికి ప్రధానిని, ఇతర ప్రముఖులను ఆహ్వానించడానికి జగన్ ఢిల్లీ వెళ్లారు. అప్పుడు అక్కడి మీడియా సమావేశంలో మాట్లాడగా వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన మద్యపాన నిషేధ హామీపై పాత్రికేయులు ప్రశ్నించారు. అప్పుడు జగన్ 'మద్యపాన నిషేధానికి సంబంధించి నేను చాలా క్లియర్‌గా చెప్పాను. దశల వారీ పద్ధతుల్లో నిషేధిస్తాం. మరోవైపు పునరావాస కేంద్రాలను పెంచాలి. అవి చేసుకుంటూపోయి 2024 ఎన్నికల సమయానికి కచ్చితంగా మద్యాన్ని ఫైవ్ స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేసిన తర్వాతే నేను ఓట్లు అడుగుతాను.' అని సెలవిచ్చారు. ఇప్పుడు వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే.. దానికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి ఉంది. మద్యపాన నిషేధ హామీని అమలు చేయలేకపోగా మద్యంపై వచ్చే ఆదాయాన్ని పరుగులు పెట్టించారు.సొంత బ్రాండ్లను, నాణ్యతలేని సరుకు విక్రయించారు.పేదబడుగు వర్గాలు తాగే చీప్ లిక్కర్‌ను నాలుగు రెట్లు పెంచి దోపిడీ చేశారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా మద్యంపై రానున్న 15 ఏళ్లలో వచ్చే మద్యం ఆదాయాన్ని తాకట్టుపెట్టి వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి చరిత్రలో నిలిచారు. అంటే మద్య నిషేధం ఆలోచన రాబోయే 15 ఏళ్లలో కూడా తనకు లేదని స్పష్టంగానే చెప్పారు జగన్.

రూ.25కే సారా ప్యాకెట్

మందు రేట్లు పెంచేయడంతో సారా విచ్చలవిడిగా పెరిగిపోయింది. పైగా మందు నాణ్యత లేక కిక్కు ఎక్కడం లేదంటూ సారా వైపు మందుబాబులు మళ్లారు. రూ.150 పెట్టి క్వార్టర్ మందుకొనడం కన్నా రూ.25 పెట్టి సారా ప్యాకెట్టు కొనడం బెటరు. కేవలం మందు రేట్లు పెంచడం, నాణ్యత లేకపోవడం వల్లే సారా తాగుతున్నామని మందుబాబులు చెబుతున్నారు.

పెంచెయ్..తాగించెయ్

గత ప్రభుత్వంలో నిర్దిష్టమైన మద్యం పాలసీ ఉండేది. అప్పుడు క్వార్టరు (180 ఎంఎల్) బ్రాండ్ మద్యం రూ.120కే దొరికేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. తర్వాత దశలవారీగా అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.20.. తర్వాత రూ.10 అదనంగా తగిలించారు.ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలను ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన గత ప్రభుత్వ పాలకులు చీప్ లిక్కర్‌ని ప్రమాణాల ప్రకారం డిస్టిలరీల్లో తయారుచేయించి రూ.60 లకే విక్రయించేవారు.ఇప్పుడు రూ.150కి విక్రయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎంఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే వ్యాపారస్తులకు 15 శాతం కమిషన్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది.ఎంఆర్పీపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదే శాలిచ్చేసింది. దీంతో గత ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టబడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. మద్యం అలవాటు ఉన్న వాళ్లు ఇప్పుడు రూ.100 కొంపకు చేర్చడం కష్టమవుతోంది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పైగా నాణ్యత లేని మద్యం, కల్తీ మద్యం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి.

ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు ఉండడం లేదు. బార్‌లలో మాత్రం మద్యం ఫుల్‌గా లభ్యమవుతోంది. ఇదే అదనుగా అనధికారికంగా ధరలు పెంచేశారు. వైసీపీ వచ్చాక క్వార్టరు క్రమంగా రూ.230కి చేరింది. దానికి మరో రూ.60 అదనంగా కలిపి బార్‌లలో రూ.290 తీసుకునేవాళ్లు. ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మందు లేక పోవడంతో బార్‌లలో రద్దీ పెరిగింది. వైసీపీ మద్యం పాలసీతో ఐదేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న బార్‌ల యజమానులు ఇదే అదనుగా మళ్లీ ధరలు పెంచేశారు.ఎక్కువ విక్రయించే బ్రాండ్లపై రూ.10-30 పెంచేశారు.అంటే గత ప్రభుత్వంలో రూ.120కి దొరికే బ్రాండ్ మద్యం క్వార్టరు ఇప్పుడు రూ.310 అయిందన్నమాట. గత ప్రభుత్వంలో రూ.100కి లభ్యమయ్యే బీరు ఇప్పటికే ప్రభుత్వ దుకాణంలో రూ.220,బార్‌లో రూ.330 అయిపోయింది.తూర్పుగోదావరి జిల్లాలోనే మద్యం అమ్మకాలు నెలకు రూ.100 కోట్లు దాటాయంటే జనం సొమ్ము ఎంత పెద్దగా వైసీపీ సర్కారు ఖజానాకు జమైందో అర్థం చేసుకోవచ్చు.

30 గ్రాములు.. మూడొందలు!

జగ్గంపేట : గంజాయి ఎక్కడ పడితే అక్కడ దొరుకుతోంది. బ్రాండ్ మద్యం క్వార్టర్ రూ.230కి విక్రయిస్తుండగా, 30 గ్రాముల గంజాయి ప్యాకెట్ రూ.300 ఉంది. క్వార్టర్ మందు ఇచ్చే కిక్‌కన్నా 30 గ్రాముల గంజాయి ఇచ్చే కిక్‌కే యువత అలవాటుపడుతున్నారు. మైనర్లు సైతం ఈ రక్కసికి చిక్కుతున్నారు. కొన్ని కిళ్లీకొట్లలో సైతం గంజాయి దొరుకుతుందంటే ఏ స్థాయిలో విస్తరించిందో అర్థంచేసుకోవాలి.

గంజాయి విచ్చలవిడిగా..

ఈ ఐదేళ్లలో పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ గంజాయి కోరలు చాచింది. యువత జీవితాలను చిత్తు చేసింది. ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి రవాణాకు అలవాటుపడ్డారు. మైనర్లు గంజాయికి అలవాటుపడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి మత్తుకు చాలా మందిని బానిసలుగా చేశారు.కోనసీమలోని కొంతమంది యువకులు గంజాయి అలవాటుపడి మత్తులో జోగుతున్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నా చర్యలు లేవు.ఇటీవల ప్రజాగళం ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు కోనసీమలో గంజాయి మత్తుకు బానిసై యువత భవిష్యత్ నిర్వీర్యమవుతోందని, గంజాయి స్మగ్లర్లకు వైసీపీ నేతల అండదండలు ఉన్నాయంటూ బహిరంగంగానే ఆరోపణాస్త్రాలు సంధించారు.గత ప్రభుత్వంలో గంజాయి సాగు ధ్వంసం నిరంతరాయంగా జరిగేది. సాగు చేస్తున్న గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించంతో అప్పట్లో గంజాయి సాగు తగ్గుముఖం పట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటివి పడకేశాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో సుమారు 600 మంది ఖైదీలు ఉన్నారు. వీరిలో అధికశాతం గిరిజనులే ఉన్నట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నాయకుల అక్రమ వ్యాపారాలకు అడ్డు లేకుండా పోయింది. గంజాయి వ్యాపారంలోను వారు బాగా రాణించారు.

గంజాయిలో వివాదాల్లో వైసీపీ నేతలు

గంజాయి వ్యవహారాల్లో వైసీపీ నేతల ప్రమేయంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద యుద్ధమే జరుగుతోంది. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లు చెలరేగిపోవడానికి గంజాయి దురలవాట్లే కారణమని పోలీసులే తేల్చారు. వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల ప్రమేయం ఉందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేశాయి. కాకినాడ లోనూ గంజాయి వ్యవహారాల్లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి హస్తం ఉందంటూ దుమారమే చెలరేగింది. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేరుగా ఆరోపణాస్త్రాలు సంధించారు. కాకినాడ సంజయ్‌నగర్ డంపింగ్ యార్డులో గంజాయి నిల్వల వెనుక ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రమేయముందని స్థానిక ప్రజలు, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ కూటమి అభ్యర్థి కొండబాబు గతంలోనే ఆరోపణలు చేశారు. గతేడాది జూన్ 14న మీడియాను డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లి చెత్తగుట్టల కింద గంజాయి ఉందని ఆరోపిస్తే పోలీసులు కొండబాబునే అదుపులో తీసుకోవడం విశేషం.



పెద్దల మాట

1967వ సంవత్సరం నుంచీ ఓటు వేస్తున్నాను. ఓటు వేయడానికి సామర్లకోట ప్రెసిడెంట్‌గారి వీధి నుంచి కిలోమీటరు దూరంలో గల సత్యనారాయణ పురం భరద్వాజాశ్రమ పాఠశాలకు వెళ్లేవారం. పోటీచేసే అభ్యర్థుల తరపున రిక్షాలు ఏర్పాటు చేసేవారు. ఏపార్టీ రిక్షాలో వెళితే..దానికే ఓటు వేసేవాళ్లం. పోటీచేసే వారు సైతం ఏ రిక్షాలో వచ్చినా ఆప్యాయంగా పలకరించేవారు. అభ్యర్థులు కలుపుగోలుగా ఉండేవారు.

సామర్లకోట, ఏప్రిల్ 22:



రెడ్డిపల్లి రాజ్యలక్ష్మి

సీనియర్ ఓటరు

పోస్టల్ బ్యాలెట్‌లో గుర్తులు ఉండవు



సామర్లకోట, ఏప్రిల్ 23: ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌లోకి వెళ్లగానే ఈవీఎంపై పార్టీ గుర్తుల ఉంటాయి. నచ్చిన పార్టీకి ఓటు వేసి వచ్చేస్తాం. అయితే గుర్తులు లేకుండా కూడా ఓట్లు వేయొచ్చు..కాకపోతే మనం కాదు ఉద్యోగులు.. అవును నిజమే..ప్రతి ఎన్నికల్లో ఉద్యోగులకు ఇచ్చే పోస్టల్ బ్యాలెట్‌లో పార్టీ గుర్తులు ఉండవు. కేవలం అభ్యర్థి, పార్టీ పేర్లు మాత్రమే ఉంటాయి. ఎన్నికల రోజు విధుల్లో పాల్గొనే ఉద్యోగులు. ప్రైవేట్ వ్యక్తులు వేసే ఓటే పోస్టల్ బ్యాలెట్. ఇంతకు ముందు బ్యాలెట్ పద్ధతిలో ఓటింగ్ జరిగే సమయంలో సాధారణ ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాన్ని ఉద్యోగులకూ ఇచ్చేవారు. వచ్చిన వాటిల్లో చివరి వాటిని తీసి పోస్టల్ ఓటు వేసే అవకాశం కల్పించేవారు. ఈవీఎం యంత్రాలు వచ్చిన తర్వాత ఉద్యోగులు, ప్రైవేట్ వ్యక్తులు యంత్రంలో ఓటువేసే పరిస్థితి లేకపోవడంతో పోస్టల్ బ్యాలెట్‌ను ఏర్పాటు చేశారు. అభ్యర్థి పేరు, పార్టీ పేరు బ్యాలెట్‌పై ముద్రిస్తారు. గుర్తు ఉండకపోవడంతో అభ్యర్థి పేరు పక్కన టిక్కు పెట్టాల్సి ఉంటుంది.

1400 ఓట్లే ఎందుకు?



పెద్దాపురం, ఏప్రిల్ 23: ఒక్కో పోలింగ్ బూత్‌లో గరిష్ఠంగా 1400 ఓటర్లు ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేస్తారు. ఇలా ఎందుకు చేస్తారో తెలుసా..? ప్రతీ బూత్‌లో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాట్ ఈ మూడు ఒకదానికొకటి అనుసంధానంగా పనిచేస్తాయి. ప్రస్తుతం వినియోగిస్తున్న ఈవీఎం (ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్)లకు అనుసంధానంగా ఉండే వీవీ ప్యాట్ (ఓటర్ వెరిఫైబుల్ పేపర్ అండ్ ట్రయల్)లో కాగితాన్ని పొందుపరుస్తారు. అది 1400 స్లిప్పులను మాత్రమే ముద్రిస్తుంది. బ్యాటరీతో పనిచేసే ప్యాట్‌లోని డిస్‌ప్లేలో ఓటు ఎవరికి వేశామన్నది కనిపిస్తుంది. అందులో 50 వరకూ కాగితం, స్లిప్పులు ఓటింగ్ రోజు మాక్ పోలింగ్ ప్రక్రియకు వాడుతారు. అందుకే ప్రతీ పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1400 ఓటర్లు మాత్రమే ఉండేలా చూస్తారు.

సిరా చుక్క ఇలా..



పెద్దాపురం, ఏప్రిల్ 23: ఓటు హక్కు ఉన్న ప్రతీ ఓటరుకు ఓటు వేసే ముందు ఎడమచేయి చూపుడు వేలుకి సిరా చుక్క గుర్తుగా పెడతారు. ఓటరుకు ఎడమచేతి చూపుడువేలు లేకపోతే మరి ఏ వేలికి సిరా గుర్తుపెట్టాలన్న ప్రశ్న తలెత్తొచ్చు. ఎన్నికల సంఘం దీనికి ప్రత్యామ్నాయం చూపించింది. ఎడమచేతి చూపుడు వేలు లేకపోతే మధ్యలోని వేలికి, అదీ లేకపోతే బొటనవేలికి సిరా చుక్క పెట్టే అవకాశం కల్పించింది. అసలు ఎడమ చేతికి వేళ్లే లేకపోతే కుడిచేయి చూపుడు వేలికి, అది లేకుంటే మధ్యవేలికి ఆ తర్వాత ఉంగరం వేలుకు, తర్వాత క్రమంలో చిటికెన వేలు, బొటన వేలికి చుక్క పెడతారు. ఒకవేళ ఎడమ కుడి చేతులకు వేళ్లు లేని పక్షంలో వేళ్ల మొదలు మధ్య భాగంలో లేదా ఇంకా చేయిపై పైభాగంలో సిరా చుక్క గుర్తు పెట్టే వెసులుబాటును ఎన్నికల సంఘం కల్పించింది.

144 సెక్షన్



సామర్లకోట, ఏప్రిల్ 23: ఎన్నికల సమయంలో, పోలింగ్ రోజున ఎక్కువగా 144 సెక్షన్ విధిస్తుంటారు. అసలు 144 సెక్షన్ అంటే ఏమిటి, ఎందుకు, ఎప్పుడు విధిస్తారో తెలుసుకుందాం. సీఆర్‌పీసీ 144 సెక్షన్ కింద ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్‌లకు విస్తృత అధికారాలు కల్పించారు. ప్రధానంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగిన సమయంలో పరిస్థితులను అదుపులోకి తీసుకువచ్చేందుకు ఈ సెక్షన్ అమలు చేస్తారు. ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా పోలింగ్ కేంద్రాల వద్ద దీనిని విధిస్తారు. ఈ సెక్షన్ అమలులోకి వచ్చే నలుగురు, ఐదుగురు వ్యక్తులకు మించి గుమిగూడి ఉండరాదు. కలిసి తిరగడంపై కూడా నిషేధాజ్ఞలు విధిస్తారు. నామినేషన్ల ప్రక్రియ నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకూ ఈ సెక్షన్ అమలులో ఉంటుంది. ఆ సమయంలో ప్రదర్శనలు, ఊరేగింపులు, ర్యాలీలు చేయరాదు. రెండు నెలల వరకూ కలెక్టర్, ప్రభుత్వం నియమించిన మేజిస్ట్రేట్ పోలీసు మాన్యువల్ ప్రకారం ఎస్పీలు ఈ సెక్షన్ అమలు చేయవచ్చు.

రాజు గారి భోజనం





ముమ్మిడివరం, ఏప్రిల్ 24: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ముమ్మిడివరం అసెంబ్లీ అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు మంగళవారం ఉదయం 11.48 గంటలకు ముమ్మిడివరం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చారు. మోటార్‌సైకిళ్లు, కార్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీ సాగింది. నామినేషన్ అనంతరం వారందరికీ పసందైన భోజనం ఏర్పాటు చేశారు. పచ్చిరొయ్యల బిర్యానీ, చికెన్ కర్రీ, వంకాయ జీడిపప్పు కర్రీ, పప్పు మామిడికాయ, సాంబారు, పెరుగు ఇలా పలు వంటకాలతో భోజనం పెట్టారు.

లేటెస్ట్ న్యూస్



రామకృష్ణారెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీజేపీ నేతలు

బీజేపీలోకి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 23: అనపర్తి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బరిలో నిలిచారు. ఆయన అభ్యర్థిత్వం ఖరారు చేస్తూ బీజేపీ ఢిల్లీ పెద్దలు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో గత 20 రోజులుగా అనపర్తి నియోజకవర్గంలో నెలకొన్న సస్పెన్స్ వీడింది. మంగళవారం రాత్రి విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యా లయానికి చేరుకున్న రామకృష్ణారెడ్డి బీజేపీ ఏపీ ఎన్నికల సమన్వ యకర్తలు సిద్ధార్థనాథ్‌సింగ్, అరుణ్ సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో చర్చలు జరిపారు. అనంతరం రామకృష్ణారెడ్డికి ఢిల్లీ పెద్దలు సిద్ధార్థనాథ్‌సింగ్, అరుణ్‌సింగ్ బీజేపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఫారం అందించారు. అనంతరం బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్డీయే అభ్యర్థిగా బీజేపీ తరపున నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పోటీ చేస్తారని ప్రకటించి ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ జెం డాలు వేరైనా మూడు పార్టీల అజెండా ఒకటేనని జగన్ రహిత రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను మార్చాలన్నదే తమ ధ్యేయమని చెప్పారు. వచ్చే ఎన్నికలలో కూటమి అభ్యర్థులు విజయఢంకా మోగిస్తారని, రాజమహేంద్రవరం ఎంపీగా ఎన్టీఆర్ కుమార్తె పురందేశ్వరి, అనపర్తి ఎన్డీయే అభ్యర్థిగా మూలారెడ్డి తనయుడైన తాను విజయం సాధించడం ఖాయమని జోస్యం చెప్పారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న పురందేశ్వరి

బాలయోగుల నేల

ముమ్మిడివరం



రామభద్రరాజు



జీఎంసీ బాలయోగి



చెల్లి వివేకానంద



పినిపే విశ్వరూప్



పొన్నాడ సతీష్



దాట్ల బుచ్చిబాబు



పళ్ల వెంకట్రావు



బుచ్చికృష్ణంరాజు




శ్రీవిష్ణు ప్రసాదరావు



పండు కృష్ణమూర్తి



బత్తిన సుబ్బారావు



బాలయోగుల క్షేత్రం



ముమ్మిడివరం నియోజకవర్గం రాజకీయంగా, ఆధ్యాత్మికంగా విశిష్టతను సంతరించుకుంది. ముమ్మిడివరంలో శ్రీభగవాన్ బాలయోగీశ్వరులు కఠోర తపస్సు చేశారు. మురమళ్లలోని వీరేశ్వర స్వామి ఆలయం, కాట్రేనికోన మండలంలో కుండలేశ్వర క్షేత్రం, కొత్తలంకలో వలీబాబా దర్గా, గేదెల్లంక ఉత్తరవాహిని ఎంతో ప్రసిద్ధి చెందినవి. ఐ.పోలవరం మండలం ఎదుర్లంక రామాలయంపేటకు చెందిన జీఎంసీ బాలయోగి లోక్‌సభ స్పీకర్ పదవిని అలంకరించడంతో ఈ నియోజకవర్గం దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. తాళ్లరేవు మండలం గాడిమొగ చమురు వ్యాపార కార్యకలాపాలతో అంతర్జాతీయ ఖ్యాతినార్జించింది. తాళ్లరేవు కోరంగి అభయారణ్యం పర్యాటక కేంద్రంగా వినతికెక్కింది. 1978లో గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యే మోకా విష్ణుప్రసాదరావు సహకార శాఖ మంత్రిగా, 1996 ఉప ఎన్నికల్లో గెలుపొందిన జీఎంసీ బాలయోగి 14 నెలల పాటు ఉన్నత విద్యా శాఖ మంత్రిగా పనిచేశారు.

● ముమ్మిడివరం

సంవత్సరం	విజేత	పార్టీ
1955	నడింపల్లి రామభద్రరాజు	కాంగ్రెస్
1962	పళ్ల వెంకట్రావు	కాంగ్రెస్
1967	చింతలపాటి కృష్ణంరాజు	స్వతంత్ర
1978	మోకా ప్రసాదరావు	కాంగ్రెస్
1983	వల్లాటి రాజాసక్కుబాయి	టీడీపీ
1985	పండు కృష్ణమూర్తి	టీడీపీ
1989	బత్తిన సుబ్బారావు	కాంగ్రెస్
1994	బత్తిన సుబ్బారావు	కాంగ్రెస్
1996	జీఎంసీ బాలయోగి	టీడీపీ
1998	చెల్లి వివేకానంద	టీడీపీ
1999	చెల్లి వివేకానంద	టీడీపీ
2004	పినిపే విశ్వరూప్	కాంగ్రెస్
2009	పొన్నాడ సతీష్‌కుమార్	కాంగ్రెస్
2014	దాట్ల సుబ్బరాజు	టీడీపీ
2019	పొన్నాడ సతీష్	వైసీపీ

ఆవిర్భావం

ముమ్మిడివరం నియోజకవర్గం 1955కు ముందు అమలాపురం నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉండేది. 1955లో చెయ్యేరు జనరల్ నియోజకవర్గంగా ఏర్పాటైంది. 1978లో ముమ్మిడివరం ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన మండలాలు ఈ నియోజకవర్గంలో ఉండేవి. 2007లో నియోజకవర్గాల పునర్విభజనలో ముమ్మిడివరం జనరల్ నియోజకవర్గంగా ఏర్పాటైంది. తాళ్లరేవు మండలం కూడా ఇందులో వచ్చి చేరింది. 2022లో జిల్లాల పునర్విభజనలో తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలో కలిసింది.

సమస్యలు

ఐ.పోలవరం మండలం గోగుల్లంకలో సాగునీరు లేక 3,600 ఎకరాల భూమి నిరుపయోగంగా ఉంది. ఐలాండ్ పోలవరం చుట్టూ 42 కి.మీ. మేర ఏటిగట్టు రోడ్డు ధ్వంసమైంది. ఈ రోడ్డును ఆధునీకీకరించాలి. గుత్తెనదీవి-గోగుల్లంక మధ్య వారధి నిర్మించాలి. సగంలో నిలిచిపోయిన పల్లంకుర్రు-జి.మూలపొలం వంతెనను పూర్తిచేయాలి. ముమ్మిడివరం, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలాల్లో నదీకోతకు గురవుతున్న లంక భూములకు రక్షణ కల్పించాలి. తాళ్లరేవులో ఐదు ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయి.



ముమ్మిడివరం నియోజకవర్గానికి ఇప్పటివరకు జరిగిన 13 సాధారణ, రెండు ఉప ఎన్నికల్లో ఓటర్లు ఏడుసార్లు కాంగ్రెస్ పార్టీకి పట్టంకట్టగా (1962, 1972, 1978, 1989, 1994, 2004, 2009) ఆరుసార్లు టీడీపీ (1983,1985, 1996, 1998, 1999, 2014), ఒకసారి ఇండిపెండెంట్

రాజకీయ చైతన్యం

అభ్యర్థిని అందలం ఎక్కించారు. వైసీపీ అభ్యర్థిని ఒకసారి గెలిపించారు. 1967లో కాంగ్రెస్ పార్టీ గాలి వీచినా దానికి ప్రతికూలంగా స్వతంత్ర అభ్యర్థి చింతలపాటి బుచ్చికృష్ణంరాజు విజయం సాధించారు. 1983, 85 ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభంజనానికి అనుకూలంగా ఆ పార్టీకి పట్టం కడితే 1994లో మాత్రం టీడీపీ ప్రభంజనాన్ని కాదని వ్యక్తిత్వానికే ప్రాధాన్యమిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి బత్తిన సుబ్బారావుకు విజయం చేకూర్చారు. నాటి తూర్పుగోదావరి జిల్లాలో ఏకైక స్థానాన్ని కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన ఘనత ముమ్మిడివరం నియోజకవర్గానిదే. 1983లో టీడీపీ అభ్యర్థిని వల్లాటి రాజా సక్కుబాయిని గెలిపించి కోనసీమలో రెండోసారి అసెంబ్లీలో మహిళకు ప్రాధాన్యత కల్పించిన ఘనత కూడా ముమ్మిడివరానిదే.

ఓటర్ల వివరాలు

నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,41,875, వారిలో పురుషులు 1,20,681 మంది కాగా, మహిళా ఓటర్లు 1,21,794, సర్వీసు ఓటర్లు 166, మహిళా సర్వీసు ఓటర్లు 3 ఉన్నాయి. పోలింగ్ కేంద్రాలు మొత్తం 268 ఉన్నాయి.

నయా ట్రెండ్



ఒకప్పుడు ఎన్నికలు వస్తే ఒకటే హడావుడి. ప్రచార పద్ధతులు కూడా విభిన్నంగా ఉండేవి. గోడల మీద పెద్ద పెద్ద అక్షరాలతో అభ్యర్థి పేరు, పార్టీ గుర్తు ముద్రించేవారు..వీధివీధిన పార్టీ కార్యాలయాలు వెలిసేవి. జెండాలతో ఊరువాడ నిండిపోయేది. రిక్షాల్లో ప్రచార హోరు అబ్బో మాములుగా ఉండేది కాదు. కానీ ఇప్పుడు అవన్నీ కనుమరుగయ్యాయి..ఎన్నికల సంస్కరణలతో పాటు సోషల్ మీడియా విస్తృతంగా విస్తరించిన ఈ కాలంలో ఎన్నికల ప్రచారంలో నయా ట్రెండ్ నడుస్తోంది.



అప్పట్లో ఇలా గోడలు మీద రాసేవారు..

మండపేట, ఏప్రిల్ 23: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు వచ్చాయంటే చాలు పల్లెలు, పట్టణాల్లో రాజకీయ పార్టీల జెండాలు, గోడల మీద రాతలు బ్యానర్లు..అబ్బో ఒకటే సందడి..పార్టీ కార్యాలయాలు వద్ద ఎంతో హడావుడి కనిపించేది. పెయింటర్లు, జెండాలు తయారు చేసేవారికి చేతినిండా పని, జేబు నిండా డబ్బు ఉండేది. జేబులకు పెట్టుకునే కాగితంతో తయారు చేసిన ప్రధాన పార్టీల గుర్తులు ముద్రించిన బ్యాడ్జీలను కార్యకర్తలకు పంపిణీ చేసేవారు. కానీ నేడు కాలం మారింది. గత రెండు మూడు ఎన్నికల నుంచి పాతకాలం నాటి జెండాలు, బ్యానర్లు, గోడలపై పార్టీల అభ్యర్థుల పేర్లు ఎక్కడా కనిపించటం లేదు. ప్రస్తుతం మారిన కాలంతో పాటు ఎన్నికల సంస్కరణలు తోడవ్వడంతో బహిరంగ ప్రచారంపై కొద్దిపాటి నిషేధం నెలకొంది. అయితే ఇప్పుడు అంతా హైటెక్ ప్రచారం. ముఖ్యంగా సోషల్ మీడియా యుగం కావడంతో అభ్యర్థులు ఎక్కువగా ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టా, ట్విటర్ లాంటి యాప్‌లపై ఆధారపడుతున్నారు. అలాగే ప్రతిఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్ ఉండడంతో వాయిస్ మెసేజ్‌ల ట్రెండ్ వచ్చేసింది. ఇప్పుడు ఫోన్ కాల్స్ చేసి మరీ ఓట్లు అడుగుతున్నారు. అభ్యర్థుల వీడియోలు, మెసేజ్‌లతో ఫోన్లు నిండిపోతున్నాయి.

అంతా కొత్తదనమే..

అలాగే ఎన్నికల సంఘం ఎన్నికల నిబంధనలు కఠినతరం చేయటంతో పార్టీల అభ్యర్థులు కుల సంఘాల సమావేశాలకు, ఆత్మీయ కలయికల పేరిట నిర్వహించే మీటింగ్‌లకు ఎటువంటి బ్యానర్లు వాడడం లేదు. కానీ తమ లక్ష్యం మేరకు వారిని సమీకరించి ప్రసన్నం చేసుకునే పని మాత్రం చేస్తున్నారు. ఒకప్పుడు అయితే నామినేషన్ల సమయంలోనో, పోలింగ్ రోజునో మాత్రమే భోజనాలు పెట్టేవారు కానీ ఇప్పుడు భోజనాలు పెట్టడం కూడా ఓటు అభ్యర్థించే ఒక మార్గంగా నాయకులు చూస్తున్నారు. పసందైన వంటకాలతో ఓటర్లకు భోజనాలు ఏర్పాటు చేసి పనిలో పనిగా తమ పై దయ చూపాలని కోరుతున్నారు. మొత్తం మీద ఇప్పుడు ఎన్నికల ప్రచారం కానీ నాయకులు ఓట్లు అడిగే విధానం కానీ డిఫరెంట్‌గా ఉంటోంది. నాయకులంతా నయా ట్రెండ్‌ను ఫాలో అయిపోతున్నారు. కొంతమంది అయితే షాట్‌ఫిల్మ్‌లతో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. ఇలా ఓటర్లకు చెప్పదలుచుకుంది ఆకట్టుకునే విధంగా చెప్పేస్తున్నారు..


ముమ్మిడివరంలో నామినేషన్ వేయడానికి భారీ ఊరేగింపుతో వెళుతున్న టీడీపీ అభ్యర్థి బుచ్చిరాజు


పెదశంకర్లపూడిలో నామినేషన్ దాఖలు చేసేందుకు ర్యాలీగా బయల్దేరిన సత్యప్రభ

ఐదో రోజు అదే జోరు

● భారీ ఊరేగింపులతో నామినేషన్లు దాఖలు చేసిన నాయకులు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఐదో రోజైన మంగళవారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మొత్తం 91 నామినేషన్లు దాఖలయ్యాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అమలాపురం లోక్‌సభ స్థానానికి ఆరుగురు, ఆరు అసెంబ్లీ స్థానాలకు 26 మంది నామినేషన్లు దాఖలు చేశారని జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. కాకినాడ జిల్లాలోని కాకినాడ లోక్‌సభ స్థానానికి ఆరుగురు, అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 26 మంది నామినేషన్లు దాఖలు చేశారు. తూర్పు గోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభ స్థానానికి 4, అసెంబ్లీలకు 25 నామినేషన్లు దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు.

కోలాహలంగా వరుపుల సత్యప్రభ నామినేషన్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 23: ప్రత్తిపాడు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా మంగళవారం కోలాహలంగా నామినేషన్ దాఖలు చేశారు. సత్యప్రభ స్వగ్రామం పెదశంకర్లపూడి గ్రామం నుంచి జగ్గంపేట మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ, బీజేపీ పార్టీల జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, చిలుకూరి రామ్‌కుమార్, జనసేన ఇన్‌చార్జ్ వరుపుల తమ్మయ్య బాబులతో కలిసి ర్యాలీగా బయల్దేరారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో కూటమి అభ్యర్థి సత్యప్రభ, బీజేపీ, జనసేన నాయకులు చిలుకూరి రామ్‌కుమార్, వరుపుల తమ్మయ్యబాబు, వరుపుల రామకృష్ణ, సత్యప్రభ సోదరుడు సురేష్‌లు వెంట ఉండగా ఆమె ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీనివాసరావుకు 2 సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేశా రు. సత్యప్రభ నామినేషన్‌కు వరుపుల రామకృష్ణ, పైలా సాంబ శివరావులు ప్రతిపాదకులుగా వ్యవహరించారు.

అనపర్తి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి నామినేషన్

అనపర్తి, ఏప్రిల్ 23: అనపర్తి అసెంబ్లీ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆయన తరపున కుమార్తె డాక్టర్ సనాతని నల్లమిల్లి కుటుంబ సభ్యులతో కలిసి ఆర్వో మాధురికి నామినేషన్ పత్రాలు అందజేశారు.

అట్టహాసంగా బుచ్చిబాబు నామినేషన్

ముమ్మిడివరం, ఏప్రిల్ 23: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు(బుచ్చిబాబు) పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో భారీ ర్యాలీగా తరలివచ్చి అట్టహాసంగా ముమ్మిడివరం ఆర్వో కార్యాలయంలో మంగళవారం ఉదయం 11.48గంటలకు నామినేషన్ దాఖలు చేశారు. తొలుత అయినవిల్లి వరసిద్ధివినాయకుడ్ని, మురమళ్ల శ్రీవీరేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఈకార్యక్రమానికి అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు, గుద్దటి జమి తరలి వచ్చారు. నాలుగు మండలాలకు చెందిన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మోటార్‌సైకిళ్లు, కార్లు, ట్రాక్టర్లతో భారీ ర్యాలీగా తరలివచ్చారు.


కాకినాడలో నామినేషన్ దాఖలుకు ముందు సమావేశమైన పళ్లంరాజు, బాపిరాజు

సమన్వయం పాటించిన హరీష్‌మాధుర్

కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు నామినేషన్ కార్యక్రమానికి మంగళవారం అమలాపురం లోక్‌సభ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్, మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుద్దటి జమీ, గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావులు ముమ్మిడివరం ఆర్వో కార్యాలయానికి వెళ్తున్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో పాటు మరో నలుగురుకి మాత్రమే అనుమతి ఇస్తామని అక్కడున్న పోలీసులు మత్స్యకార నాయకుడు నాగిడి నాగేశ్వరరావును గేటు వద్ద అడ్డుకున్నారు. దీంతో హరీష్‌మాధుర్ గేటు బయటే ఆగిపోయి నాగిడి నాగేశ్వరరావును పంపించారు. అయితే గుత్తుల సాయి, నాగిడి నాగేశ్వరరావు వెనక్కి వెళ్లి గంటి హరీష్‌ను లోపలకి పంపించిన సన్నివేశం హరీష్‌మాధుర్‌లో ఉన్న సహనం, ఓర్పు తేటతెల్లం చేశాయి. స్వర్గీయ జీఎంసీ బాలయోగిలోని సగ్గుణాలే హరీష్‌మాధుర్‌లో ఉన్నాయని అక్కడ ఉన్నవారు కితాబు ఇచ్చారు.


పి.గన్నవరంలో ఎంపీ అభ్యర్థి గంటిహరీష్ మాధుర్‌తో కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ

కూటమి అభ్యర్థి గిడ్డి నామినేషన్ దాఖలు

పి.గన్నవరం, ఏప్రిల్ 23: పి.గన్నవరం నియోజకర్గం కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ మంగళవారం పి.గన్నవరం ఆర్వో కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు. గంటిపెదపూడి నుంచి ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌తో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ద్విసభ్యకమిటీ సభ్యుడు నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ చీకురమిల్లి వెంకటేశ్వరరావు, శిరిగినీడి వెంకటేశ్వరావు, చెరుకూరి గోపాలకృష్ణ, వాసంశెట్టి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ పార్లమెంట్ అభ్యర్థిగా పళ్లంరాజు నామినేషన్ దాఖలు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 23: కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థిగా కేంద్ర మాజీమంత్రి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. తొలుత జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడినుంచి టీటీడీ మాజీ చైర్మన్ కనుమూరి బాపిరాజుతో కలిసి పార్టీ నాయకులు, కార్యకర్తలతో పాదయాత్రగా కలెక్టరేట్‌కు చేరుకుని రిటర్నింగ్ అధికారికి నాలుగుసెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చిలుకోటి పాండురంగారావు, పీసీసీ ఉపాధ్యక్షుడు మట్టా వెంకటప్రసాద్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల గాంధీంరాజు, నాయకులు బుర్రా పద్మనాభం, రాజారపు మహేష్, రాజు పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయిన తరువాతే

రాష్ట్రంలో ఉపాధి కల్పన

» ఏపీ ప్రొఫెషనల్స్ వింగ్ అధ్యక్షురాలు తేజస్విని పొడపాటి

ద్రాక్షారామ, ఏప్రిల్ 23: రాష్ట్రానికి 1995లో చంద్రబాబు సీఎం అయిన తరువాతే పారిశ్రామిక అభివృద్ధి జరిగి ఉపాధి కల్పనతో ప్రైవేటు ఉద్యోగాలు పెరిగాయని తెలుగు ప్రొఫెనల్స్ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తేజస్వి పొడపాటి అన్నారు. మంగళవారం రామచంద్రపురం మండలం వెంకటాయపాలెంలో సాయిమాధవానంద ఫంక్షన్ హాలులో నిర్వహించిన ఫస్ట్ ఓట్ ఫర్ ఏపీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చంద్రబాబు సీఎం అయిన తర్వాత పేదలను మధ్య తరగతికి, మధ్య తరగతి వారిని ఉన్నతస్థాయికి మార్చే దిశగా ఎన్నో కంపెనీలు చుట్టూ తిరిగి వందల కంపెనీలు రాష్ట్రానికి తీసుకువచ్చారన్నారు. కంపెనీల్లో పని చేసేందుకు వనరుల కల్పనకు అప్పటివరకు 30కళాశాలలు ఉండగా 300 కళాశాలలకు పెంచారన్నారు. ఇంజనీరింగ్, ఐటీ ద్వారా ఉపాధి తీసుకువచ్చారన్నారు. సమావేశంలో కూటమి అభ్యర్థి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ప్రొఫెషనల్స్ వింగ్ సభ్యులు మాట్లాడారు. తెలుగుయువత నాయకుడు అర్జునలరిష్యంత్ రాయ్ అధిక సంఖ్యలోయువతీ యువకులు పాల్గొన్నారు.

సత్యదేవుడి హుండీల ఆదాయం రూ.1.32 కోట్లు

అన్నవరం, ఏప్రిల్ 23: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించగా రూ.1,32,78,743 నగదు, 25 గ్రాముల బంగారం, 180 గ్రాముల వెండి సమకూరాయి. వీటితోపాటుగా యుఎస్ ఏ 122 డాలర్లు, ఆస్ట్రేలియా 10, యూరోలు 35, యుఏఈ 175 దిరహమ్స్ లభించాయి. సిబ్బంది, వ్రతపురోహితులు, నాయీబ్రాహ్మణులు లెక్కింపు చేపట్టగా ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు లెక్కింపు పర్యవేక్షించారు. 27 రోజులకు ఈఆదాయం సమకూరగా, హుండీలద్వారా రోజుకు రూ.4.91 లక్షలు భక్తులు సమర్పించారు.

పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద పట్టుబడ్డ

రూ.2 కోట్ల 58లక్షల విలువైన బంగారు, వెండి


పొట్టిలంక చెక్‌పోస్టు వద్ద బంగారు, వెండిని పరిశీలిస్తున్న సీఐ తులసీధర్, తహసీల్దారు రమాదేవి

కడియం, ఏప్రిల్ 23: కడియం మండలం పొట్టిలంక వద్ద జాతీయరహదారిపై ఏర్పాటుచేసిన చెక్‌పోస్టు (ఎస్ఎస్‌టీ) వద్ద వాహనాల తనిఖీలో భాగంగా కంటైనర్ బొలోరో వాహనాన్ని ఆపి తనిఖీలు చేస్తుండగా, అందులో రూ. 2కోట్ల 58 లక్షల విలువైన బంగారు, వెండి వస్తువులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. రవాణా చేస్తుండగా పోలీసులు గుర్తించారు. సమాచారం అందడంతో సీఐ తులసీధర్ సంఘటనా స్థలానికి వెళ్లారు. సమాచారాన్ని ఎస్పీ పి.జగదీష్, రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్‌కు తెలిపారు. వారి ఆదేశాల ప్రకారం అసి స్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, కడియం తహసీల్దారు బి.రమాదేవి, ఫ్లైయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి, స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కె.వినయ్ బృందం, ఇన్‌కంటాక్స్, జీఎస్టీ అధికారులు చెక్‌పోస్టు వద్దకు చేరుకున్నారు. అధికారుల సమక్షంలో వాటిని తెరచి పరిశీలించగా అందులో రూ. 2కోట్ల 57 లక్షల విలువైన 3.347 కేజీల బంగారు నగలు, రూ. లక్షా 7వేలు విలువైన 1.209 కేజీల వెండి ఆభరణాలు మొత్తం సుమారు రూ. 2 కోట్ల 58 లక్షల వస్తువులు రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. రిటర్నింగ్ అధికారి ఆదేశాల మేరకు ఈ ఆభరణాలను కట్టుదిట్టమైన భద్రత మధ్య ఉంచినట్లు అధికారులు తెలిపారు. వీటిని రాజమహేంద్రవరంలో వివిధ నగల దుకాణానికి తీసుకు వెళుతున్నట్లు గుర్తించారు.

వాహన తనిఖీల్లో రూ.12.20 లక్షలు స్వాధీనం

పెద్దాపురం, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెద్దాపురం నియోజకవర్గంలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.12.20లక్షల నగదును స్వాధీనం చేసు కున్నట్లు ఆర్డీవో జె.సీతారామారావు తెలిపారు. సామర్లకోట మెయిన్ రోడ్డులో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె.ప్రదీప్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో ఈనగదును పట్టుకున్నా మని చెప్పారు. సామర్లకోట పట్టణానికి చెందిన పి.మురళీకృష్ణ అనే వ్యక్తి నుంచి ఈ నగదును స్వాధీనం చేసుకున్నా మన్నారు. సరైన ఆధారాలు ఏవీ చూపించకపోవడంతో నగదును సీజ్ చేసి కాకినాడ ట్రెజరీకి జమ చేశామన్నారు.

రైల్వే స్టేషన్లో రూ.20కే భోజనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రైల్వే తక్కువ ధరకే మినీ భోజనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎకానమీ, స్నాక్, కాంబో మీల్స్ పేరుతో విజయవాడ డివిజన్‌లోని 12 స్టేషన్లలో 23 కౌంటర్లలో తక్కువ ధరకు భోజనాన్ని అందిస్తున్నారు. జనరల్ బోగీల వద్ద కౌంటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నా రు. ఏడు పూరీలు(175గ్రాములు), డ్రై ఆలూ వెజ్(150గ్రా) లేదా 200గ్రా పెరుగు అన్నం/పులిహోరను రూ.20, ప్రాంతీయ రుచులకు సంబంధించిన 350గ్రా ఆహారాన్ని రూ.50కి విక్రయిస్తున్నారు. తక్కువ ధర అని నాసిరకం ఆహా రం ఉండదని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అందిస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఈ తక్కువ ధర ఆహారం విక్రయించే చోట వేయింగ్ మిషన్‌ని అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు సూచిస్తున్నారు. గతంలో జనతా భోజనం పేరుతో రూ.10కే అందుబాటులో ఉండడం గమనార్హం.

సినిమాలకు పునాది నాటకమే

● ప్రముఖ నటుడు, రచయిత మహ్మద్ షఫీ

పోర్టుసిటీ(కాకినాడ), ఏప్రిల్ 23: సినిమాలకు పునాది నాటకమేనని ప్రముఖ నటుడు, రచయిత మహ్మద్ షఫీ అన్నారు. శ్రీప్రకాష్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో కాకినాడ దంటు కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న గస్తో వేడుకల్లో షఫీతోపాటు థియేటర్ ఆర్ట్స్ ప్రొఫెసర్ బి.అనంతకృష్ణన్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. రెండోరోజు మంగళవారం ముగింపు సందర్భంగా షఫీ జ్యోతి ప్రజ్వలనచేసి కార్యక్రమాలను ప్రారం భించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు విద్యార్థి దశ ఎంతో కీలకమన్నారు. ప్రొఫెసర్ అనంతకృష్ణన్ మాట్లాడుతూ నేడు నాటక రంగానికి ప్రాధాన్యం తగ్గిపోతున్న తరుణంలో శ్రీప్రకాష్ స్కూల్ యాజమాన్యం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ చిట్టూరి విజయప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు తాము ఎల్లప్పుడూ కృషి చేస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ విజయప్రకాష్ సతీమణి సమీర, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, కాకినాడ బ్రాంచ్ ప్రిన్సిపాల్ శ్రీదేవితోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రముఖ నటుడు మహ్మద్ షఫీ


గౌతమి నదీ వద్ద స్వామివారి చక్రస్నాన మహోత్సవంలో ఆలయ ఉప కమిషనర్ కిషోర్‌కుమార్, వెంకన్న చక్రస్నానం నిర్వహిస్తున్న దృశ్యం


అన్నవరంలో సీతారాములకు చక్రస్నానం నిర్వహిస్తున్న పండితులు

వైభవంగా వాడపల్లి వెంకన్న చక్రస్నానం

ఆత్రేయపురం, ఏప్రిల్ 23: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి శ్రీవేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో ఆరో రోజైన మంగళవారం వేకువజామున మేల్కొలుపు, తీర్థపు బిందెతో ఉత్సవమూర్తులకు అభిషేకం, నిత్యార్చన, నిత్య హోమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. హోమ శాలలో ప్రధాన హోమాలు, మహాశాంతి హోమం, పూర్ణాహుతి జరిపి కేరళ వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. గౌతమి గోదావరి తీరాన స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి పంచామృతాభిషేకాలు జరిపారు. అశేష భక్తుల గోవిందనామస్మరణ నడుమ స్వామివారి చక్రస్నాన మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తన్మయత్వం పొందారు. ఉప కమిషనర్, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు. రాత్రి విద్యుత్ కాంతులు, మిరుగొట్లు కొలిపే బాణసంచా కాల్పుల నడుమ సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. వివిధ ప్రాం తాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

సీతారాములకు ఘనంగా చక్రస్నానం

అన్నవరం, ఏప్రిల్ 23: అన్నవరం ఆలయ క్షేత్రపాలకులుగా పూజలందుకుంటున్న సీతారాముల దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. ఉదయం 10గంటలకు నవదంపతులైన సీతారాములను, పెండ్లిపెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మేళతాళాలతో కొండదిగువన పంపా సరోవరం వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ఏర్పాటుచేసిన ప్రత్యేకవేదికపై వీరిరువురినీ ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పంపా సరోవరంవద్ద సీతారాములతో పాటుగా, సుదర్శన చక్రం, త్రిశూలంలకు ముమ్మారు స్నానమాచరింపచేశారు. తిరిగి వేదికవద్దకు తీసుకుని వచ్చి పూజలు అనంతరం చతుర్వేద పండితులు వేదాశీర్వచనం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

బంగారం దోపిడీ చేసిన వ్యక్తి అరెస్టు

● 21కిలోల గంజాయి, మోటార్ సైకిల్, ఇనుపరాడ్డు, 8 గ్రాముల బంగారం స్వాధీనం


మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్ కుమార్

అనపర్తి, ఏప్రిల్ 23 : చెడు వ్యసనాలకు బానిసైన యువకుడు ఈజీమనీ కోసం మహిళల మెడలోని బంగారు ఆభరణాలను దొంగిలించడం ఆపై బంగారం విక్రయించగా వచ్చిన సొమ్ముతో గంజాయి కొనుగోలు చేస్తున్న వ్యక్తిని మంగళవారం అనపర్తి పోలీసులు అరెస్టు చేశారు. ఈనెల 2వ తేదీన అనపర్తి మండలం పీరా రామచంద్రపురం గ్రామంలో హార్డువేర్ షాపులో సామాన్లు కొనే నెపంతో షాపు లో ఒంటరిగా ఉన్న మహిళను ఇనుప రాడ్డుతో తలపై గాయపరచి ఆమె మెడలోని బంగారు ఆభరణాలను దొంగిలించిన నిందితుడు మంగళవారం అనపర్తిలో పట్టు బడ్డాడు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను అనపర్తి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈస్ట్ జోన్ డీఎస్పీ కిషోర్‌కుమార్ వివరించారు. కడియం మండలం జేగురుపాడుకు చెందిన తానంకి క్రాంతి కుమార్ చైన్ స్నాచింగ్‌లకు పాల్పడుతూ ఇటీవల పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చాడు. ఈనెల 2వ తేదీన అనపర్తి మండలం పీరా రామచంద్రపురంలో హార్డ్‌వేర్ షాపులో మహిళ ఒంట రిగా ఉండటం గమనించిన క్రాంతికుమార్ అదును చూసు కుని తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో ఆమె తలపై గాయపరచి ఆమె మెడలోని 43 గ్రాముల పుస్తెల తాడును దోచుకుపోయాడు. షాపులో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడి కోసం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు జిల్లా ఐటీ కోర్ టీమ్, జిల్లా క్రైం పార్టీ ఆధ్వర్యంలో బృందాలుగా ఏర్పడి నిందితుడి కోసం వెతకడం ప్రారంభించారు. నిందితుడు గంజాయి విక్రయాలు సాగిస్తాడన్న సమాచారం తెలుసుకున్న పోలీసులు ముందస్తు సమాచారంతో అనపర్తి ఐఎల్‌టీడీ ఓవర్ బ్రిడ్జి సమీపంలో వలపన్ని పట్టుకున్నారు. అతనివద్ద నుంచి 21 కిలోల గంజాయిని, దొంగిలించిన బంగారంలో ఎనిమిది గ్రాముల బంగారాన్ని, మోటార్ సైకిల్ ను, దాడికి ఉపయోగించిన ఇనుప రాడ్డును స్వాధీనం చేసుకున్నారు. ఇతనిపై రాయవరం, మండపేట రూరల్ ఏడిద, పోలవరం పోలీస్‌స్టేషన్లలో చైన్ స్నాచింగ్ కేసులు నమోదై ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. దాడికిగురైన మహిళ ప్రస్తుతం కోలుకుంటున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించేందుకు కృషిచేసిన హెచ్‌సీ సురేష్‌బాబు, పీసీలు జి.తిమ్మారావు, తిరుమల యాదవ్‌లకు ఎస్పీ జగదీష్ ప్రకటించిన రివార్డులను డీఎస్పీ అందజేశారు. ఈ సమావేశంలో సీఐ శివగణేష్, ఎస్ఐ రామారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎడ్లపరుగు పోటీలు

● విజేత గుమ్మిలేరు ఎడ్లజత


పరుగుపెడుతున్న ఎడ్లు, విజేతలకు షీల్డులు అందజేస్తున్న దృశ్యం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 23: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో సోమవారం నిర్వహించిన సీతారామ రాష్ట్రస్థాయి ఎడ్లపరుగు పోటీలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. 216వ జాతీయ రహదారి చెంతన గల అడవిపుంత రోడ్డులో జరిగిన ఈ పోటీలను తిలకించేందుకు చేబ్రోలు పరిసర గ్రామాలు నుంచి భారీగా ప్రజలు తరలివచ్చారు. ఉమ్మ డి తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాలు, బాపట్ల, అనకాపల్లి తదితర జిల్లాలు నుంచి తరలివచ్చిన ఎడ్లజతలు సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో జరిగిన పోటీల్లో పాల్గొన్నాయి. న్యాయనిర్ణేతలుగా కాకినాడ, సామర్లకోటలకు చెందిన చేకూరి రామకృష్ణ, కంటే ఫణికుమార్‌లు వ్యవహరించగా, జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు, ఎంపీపీ అరిగెల అచ్చియ్యమ్మ రామయ్యదొర తదితరులు విజేతలకు బహుమతులు, షీల్డులు అందజేశారు.

విజేతలు వీరే : సీనియర్స్ విభాగంలో గుమ్మిలేరుకు చెందిన కోరా వీరవెంకట సత్యవేణికి చెందిన ఎడ్లజత ప్రథమస్థానాన్ని కైవసం చేసుకోగా, వారికే చెందిన మరో ఎడ్లజత చేబ్రోలుకు చెందిన కొణిదెల పవన్‌కల్యాణ్ ఎడ్లజత ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. జూనియర్స్ విభాగంలో గుమ్మిలేరు ఎడ్లజత, కొవ్వాడలో మట్టా నవనీత్ శ్రీమణికంఠ ఎడ్లజత, వన్నెపూడి బవిరిశెట్టి మణి ఎడ్లజత ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానా లు గెలుచుకున్నారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి

కపిలేశ్వరపురం/మండపేట, ఏప్రిల్ 23 : అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురంలోని గోదావరినదిలో మంగళవారం స్నానానికి దిగిన యువకుడు గల్లంతై మృతి చెందాడు. అంగర ఎస్ఐ పరదేశి తెలిపిన వివరాల ప్రకారం... గోదావరి నదిలో ఐదుగురు యువకులు స్నానానికి దిగారు. వీరిలో మండపేటకు చెందిన యంద్ర మురళీకృష్ణ(20) ప్రమాదవశాత్తూ గోదావరి నదిలో మునిగి మృతిచెందాడు. మృతుడు మురళీకృష్ణ విజ్ఞాన్ కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. మురళీకృష్ణ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సూర్యారావుపేటలో విషాదఛాయలు

మండపేట పట్టణంలోని సూర్యారావుపేటకు చెందిన మురళీకృష్ణ ప్రైవేటు కళాశాలలో బీకాం సెకండియర్ చదువుతున్నాడు. సోమవారం నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు పరీక్ష రాసిన మురళీకృష్ణ బుధవారం రెండో పరీక్ష రాయాల్సి ఉంది. కళాశాలలో పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో మంగళవారం కళాశాలకు రావడంతో తన సహచర విద్యార్థులు నలుగురితో కలిసి కపిలేశ్వరపురం గోదావరిలో స్నానానికి వెళ్లి గోదావరిలో మునిగి మృత్యువాతకు గురయ్యాడు. మురళీకృష్ణ మృతితో అతడి కుటుంబంలో విషాదఛాయలు అలముకున్నాయి. పరీక్ష రాస్తాడనుకున్న కొడుకు స్నేహితులతో కలిసివెళ్లి ఇలా గోదావరిలో దిగి మృత్యువాతకు గురవుతాడని ఊహించలేదని విద్యార్థి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడు అన్న బెంగుళూరులో ఉద్యోగం చేస్తున్నాడు. తమ్ముడు మరణవార్త తెలిసిన వెంటనే అతడు అక్కడి నుంచి బయలుదేరి వస్తున్నాడు. మురళీకృష్ణ బీకాం సెకండియర్ పరీక్ష బుధవారం రాయాల్సి ఉందని ఇంటివద్ద పరీక్షకు సిద్ధం కావాల్సిన సమయంలో ఇలాంటి సంఘటన చోటుచేసుకోవటం దురదృష్టకరమని కళాశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అంటున్నారు.


గోదావరిలో నుంచి తీసిన మురళీకృష్ణ మృతదేహం, ఇన్‌సెట్‌లో మురళీకృష్ణ (ఫైల్)

రెల్లుగడ్డలో వివాహిత దారుణ హత్య

అల్లవరం, ఏప్రిల్ 23: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం రెల్లుగడ్డలో ఒక వివాహిత మంగళవారం దారుణ హత్యకు గురైంది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం... రెల్లుగడ్డకు చెందిన బొంతు మణికుమారి (35)పై అదే గ్రామానికి చెందిన కొంబత్తుల నవీన్‌కుమార్ పొడవైన కత్తితో దాడిచేసి విచక్షణారహితంగా నరకడంతో ఆమె మరణించింది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో నవీన్ బాత్రూమ్‌లో మాటు వేసి దాడికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. వివాహేతర సంబంధమే కారణం కావచ్చని వారు చెబుతున్నా రు. ఇంటి లోపల తలుపులు గడియపెట్టి ఉండగా అరుపులు వినిపించడంతో కిటికీలోంచి చూసిన బాలుడు కేకలు వేశాడు. హత్య చేసిన వెంటనే నవీన్ పరారయ్యాడు. కుటుంబ సభ్యులు, బంధువులు వచ్చి ఈ ఘటనపై పోలీసులకు సమాచారం ఇచ్చారు.


హత్యకు గురైన బొంతు మణికుమారి మృతదేహం

అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు, ఎస్ఐ జి.హరీష్‌కుమార్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. మణికుమారి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. హత్య కేసుగా నమోదు చేశామని, నిందితుడి కోసం రెండు బృందాలతో గాలిస్తున్నట్లు సీఐ వీరబాబు తెలిపారు. కాగా మణికుమారి భర్త రామకృష్ణ ఉపాధి నిమిత్తం గల్ఫ్‌లో ఉంటున్నాడు. వారికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు.

ఏజెన్సీ సమాచారం

శిరీష,రాజేశ్వరి మధ్య సయోధ్య

రంపచోడవరం, ప్రత్తిపాడులో సమన్వయ సమావేశాలు

నేడు శ్రీకాకుళంలో చంద్రబాబును కలవనున్న ఇద్దరు నేతలు



రంపలో కలిసిన ఇద్దరు నేతలు

రంపచోడవరం, ఏప్రిల్ 23: రంపచోడవరం తెలుగుదేశం అభ్యర్థి మిరియాల శిరీష దేవి, అసంతృప్తి నేత వంతల రాజేశ్వరి మధ్య టీడీపీ అధిష్ఠానం మంగళవారం సయోధ్య కుదిర్చింది. తొలుత పార్టీ రంపచోడవరం పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ ఈ ఇద్దరినీ, వారి అనుచరులతో కలిపి రంపచోడవరంలో సమన్వయపర్చారు. అనంతరం పార్టీ ముఖ్యనేత దామచర్ల సత్య సమక్షంలో ప్రత్తిపాడులో మరో సమన్వయ సమావేశాన్ని నిర్వహించి మిరియాల శిరీష దేవి-వంతల రాజేశ్వరి కలిసి పని చేయాలని, శిరీషను రాజేశ్వరి ముందుండి నడిపించాలని, రాజేశ్వరికి పార్టీతో పాటు ప్రభుత్వంలో కూడా సముచిత స్థానాన్ని కల్పిస్తారని చంద్రబాబు మాటగా ఈ నేతలు సమావేశంలో స్పష్టం చేశారు. సమావేశం ముగిసి అందరూ తిరిగి వస్తుండగా ఈ ఇద్దరి నేతలను తన ముందు హాజరు పర్చాలని చంద్రబాబు నుంచి పిలుపు రావడంతో పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాస్ వీరిద్దరినీ శ్రీకాకుళం తీసుకువెళ్లారు. బుధవారం ఉదయం 9-30 గంటలకు వీరితో చంద్రబాబు సమావేశం కానున్నారు.

వంతల సారథ్యంలో టీడీపీ గెలుపు

కూనవరం, ఏప్రిల్ 23: మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో తెలుగుదేశం రంపచోడవరం అసెంబ్లీ అభ్యర్థి శిరీషాను గెలిపించుకుంటామని కూనవరం తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటు ప్రతినిధి యడవల్లి భాస్కరరావు అన్నారు. రంపచోడవరం నియోజకవర్గ గెలుపు బాధ్యతలను వంతల రాజేశ్వరికి మాజీ సీఎం చంద్రబాబు అప్పగించడం హర్షణీయమన్నారు. అంతేకాకుండా అధికారంలోకి వచ్చాక వంతలకు మంచి హోదా కల్పిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారని చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగుదేశం కార్యకర్తలు వర్గ విభేదాలు వీడి శిరీష గెలుపునకు ఐక్యంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పొడియం అప్పారావు, గడేసుల ప్రేమ్‌చంద్, టీడీపీ నాయకులు ఎస్‌కే రసూల్ పాల్గొన్నారు.

టెన్త్‌లో ప్రతిభ కనబరిచిన వారికి నగదు బహుమతులు



హెచ్ఎం ప్రవీణ్‌నాయక్‌కు నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

మోతుగూడెం, ఏప్రిల్ 23: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన వారికి డొంకరాయి జిల్లా పరిషత్ పాఠశాల పూర్వ విద్యార్థులు నగదు బహుమతి అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన బొడ్డు స్నేహశ్రీకి రూ.10 వేలు, ద్వితీయ స్థానం సాధించిన ఎం.ఇంద్రారెడ్డికి రూ.6 వేలు, తృతీయ స్థానం సాధించిన వారికి రూ.4 వేలు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ నాయక్, గ్రామస్థులు పూర్వ విద్యార్థులకు ధన్యవాదాలు తెలిపారు.


ఐదో రోజు రెండు నామినేషన్లు



నామినేషన్ పత్రాలు స్వీకరిస్తున్న ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, ఏప్రిల్ 23: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఐదో రోజు రెండు నామినేషన్ పత్రాలు అందాయని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. వై.రామవరం మండలం గుర్తేడు పంచాయతీ అల్లూరి గడ్డ గ్రామానికి చెందిన కాకూరు కన్నపురెడ్డి, ఎటపాక మండలం చిన్నంపేట గ్రామానికి చెందిన కుంజా శ్రీను నామినేషన్ పత్రాలు సమర్పించారన్నారు. కార్యక్రమంలో ఏఆర్వో ఎ.జ్యోతికృష్ణ, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, ఎ.సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలుబాబు, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

ఆదివాసీల హక్కుల కోసం ఉద్యమిస్తాం



ఆర్వోకు నామినేషన్ పత్రం అందిస్తున్న కుంజా శ్రీను

రంపచోడవరం, ఏప్రిల్ 23: ఆదివాసీలు ఐక్యంగా ఉద్యమించే సమయం ఆసన్నమైందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఎమ్మెల్యే అభ్యర్థి కుంజా శ్రీను అన్నారు. మంగళవారం ఆయన సబ్ కలెక్టరు కార్యాలయంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ తరపున అసెంబ్లీ అభ్యర్థిగా నిమినేషన్ దాఖలు చేశారు. తొలుత స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు కాకి మధు, జిల్లా అధ్యక్షుడు తీగల బాబూరావు, పేట ప్రసాద్, బొరగ ఎర్రమ్మ, కారు అరుణకుమారి, చవలం రాంబాబుదొర, మోడిత నూకరాజు, చోడే ప్రదీప్, ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎండ దెబ్బకు విలవిల

మోతుగూడెం, ఏప్రిల్ 23: వై.రామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయిలో మంగళవారం భానుడు ప్రతాపానికి జనం అల్లాడి పోయారు. 41డిగ్రీలు ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 8గంటల నుంచేఎండ తీవ్రంగా ఉండటంతో బెంబేలెత్తిపోయారు. వడగాలులు ఉక్కపోతతో చిన్న, పెద్ద ఉక్కిరిబిక్కిరయ్యారు. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని గాలికొదిలేశారు : నెహ్రూ

గోకవరం, ఏప్రిల్ 23: వైసీపీ ఐదేళ్ల పాలనలో మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని గాలికొదిలేశారని, టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆపథకం పనులను పునఃప్రారంభిస్తామని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని మల్లవరం, శివరామపట్నం గ్రామాలలో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, కాకినాడ ఎంపీగా ఉదయ శ్రీనివాస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పాలిస్తేనే రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందుతుందని నెహ్రూ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జూన్ 29కి వాయిదా

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు తదితర కారణాల వల్ల మే 11న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ని జూన్ 29న నిర్వహిస్తారని జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. మంగళవారం వివిధ బీమా సంస్థలతో సమావేశమై మోటారు వాహనాల ప్రమాదాల కేసులు అధిక మొత్తంలో పరిష్కారం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అలాంటి కేసుల వివరాల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాసస్ చైర్మన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు

85 శాతం హామీలు ఎగ్గొట్టిన జగన్

రాజమహేంద్రవరం రూరల్ అభ్యర్థి గోరంట్ల, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి



అంబేడ్కర్, బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన గోరంట్ల, పురంధేశ్వరి

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 23: ఎన్నికల పాదయాత్రలో జగన్ మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను నమ్మించి ఓట్లు వేయించుకున్నారని, అధికారంలోకి వచ్చిన తరువాత జగన్ 85శాతం హామీలను ఎగ్గొట్టి రాష్ట్ర ప్రజలను మోసంచేశారని రూరల్ నియోజకవర్గ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. మంగళవారం రూరల్ మండలం కోలమూరులో టీడీపీ నాయకులు పిన్నమరెడ్డి ఈశ్వరుడు ఆధ్వర్యంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి ని దగ్గుబాటి పురందేశ్వరిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీ అధి కారంలోకి రావాలన్నారు. ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. గోరంట్ల మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగాల భర్తీ పేరిట హామీ ఇచ్చి దగా చేశార న్నారు. 2,30,000 ఉద్యోగాలిస్తామని మాట తప్పారన్నారు. మెగా డీఎస్సీని దగా డీఎస్సీ చేశారన్నారు ఇసుక రేట్లు 4 రెట్లు పెంచి 40లక్షల మంది భవన నిర్మాణ కార్మికులను దెబ్బతీశారని ధ్వజమెత్తారు. నాసిరకం మద్యంతో లక్షల మంది ఆరోగ్యాన్ని నాశనం చేశారన్నారు. ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి పూర్తి చేయలేదని గోరంట్ల మండిపడ్డారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే కేంద్ర ప్రభుత్వ సహకారం కావాలని, దాని కోసమే చంద్రబాబు బీజేపీతో పొత్తు పెట్టుకున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రూరల్ నియోజకవర్గంలో తనకు సైకిల్ గుర్తుపైనా, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటేసి విజయం చేకూర్చాలని కోరారు. మత్యేటి ప్రసాద్, వాసిరెడ్డి రాంబాబు, మజ్జి పద్మ, యర్రా వేణుగోపాలరాయుడు, బొంతు విష్ణు, బీజేపీ ఆకుల శ్రీధర్, టీడీపీ, జనసేన, బీజేపీనాయకులు గంగిన హనుమంతరావు, నున్న కృష్ణ, కురుకూరి కిషోర్, మన్యం నాగేంద్రనాద్, గంగిన నాని, ఆచారి, యానాపు ఏసు, అడ్డాల శ్రీను, గోక శ్రీను, బత్తిన కొండబాబు, అడ్డాల పెద్దశ్రీను, ఉదుమూడి శ్రీధర్, దారా అన్నవరం, కర్రి నాయుడు, అడబాల నాగబాబు, సుబ్బారావు, పిల్లా తనూజ, దండమూడి ప్రమీల, కణితి చంద్రశేఖర్, బత్తిన రమణ, నూకతట్టి పెద్ద, అంగర శ్రీను, నిట్టపల్లి ప్రసాద్, కొల్లి అబ్బులు, పోసుపో రుబున్, బి.సరోజిని, కోటిపల్లి అమ్ములు, కంచర్ల లక్ష్మి, పత్తి మంగ, మద్దా మణి, నాగవర్థిని తదితరులు పాల్గొన్నారు.





కోలమూరు, రాయుడుపాకలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల, హారతులు ఇస్తున్న మహిళలు

టీడీపీలోకి భారీ చేరికలు

సీతానగరం, ఏప్రిల్ 23: ప్రముఖ వైసీపీ నాయకుడు మాజీ సహకార సంఘం అధ్యక్షుడు వడ్లమూరు సోమరాజు టీడీపీలో చేరారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజక వర్గ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి ఆయనకు టీడీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఆయనతో పాటు కోసూరి రవికుమార్ రాజు, తోటకూర పుల్లపురాజు, మాగంటి వీరబాబు, ఆంజిబాబు, పిల్లి శ్రీను, దుర్గాప్రసాద్, శ్యామల తదితరులు పార్టీలో చేరారు.



ఆలయ కమిటీ చైర్మన్ టీడీపీలో చేరిక

వైసీపీ నుంచి టీడీపీలోకి సీతానగరం దేవదాయశాఖకు చెందిన సీతారామాలయం చైర్మన్ కాండ్రు వీరన్న టీడీపీలో చేరారు. ఈయనకు టీడీపీ సీనియర్ నాయకుడు గెద్దం తిమ్మారావు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వలవల రాజా, పెందుర్తి అచ్యుతరామారావు లక్కిశెట్టి శ్రీను, కాండ్రు శ్రీనివాసరావు, కాండ్రు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. మంగళవారం మండలంలో భారీగా వైసీపీ నుంచి టీడీపీలోకి 200 మంది వరకు చేరారు.

ఐఎస్‌టీఎస్ అధ్యాపకులకు ఎడ్యుకేషనల్ ఎక్సలెన్సు అవార్డులు



అవార్డు అందుకుంటున్న ప్రిన్సిపాల్ రాజాశ్రీరావు

రాజానగరం, ఏప్రిల్ 23 : విద్యారంగంలో విశేష సేవలందించినందుకుగానూ మండలంలో తూర్పుగోనగూడెంలోని ఇంటర్నేషనల్ స్కూల్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (ఐఎస్‌టీఎస్) మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో విధులు నిర్వర్తిస్తున్న ప్రిన్సిపాల్ వై.రాజాశ్రీరావుకు భీష్మాచార్య, వైస్ ప్రిన్సిపాల్ డి.డి.డి.సూరిబాబుకి జ్యేష్టాచార్య అవార్డులు అందుకున్నారు. కళాశాలలోని ట్రైనో విజన్ సంస్థ భారత్ ఎడ్యుకేషనల్ ద్వారా విద్యా అధ్యాపకులకు ప్రతి ఏడాది ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డులను ప్రకటించడంలో భాగంగా ఈ ఏడాది ఐఎస్‌టీఎస్ కళాశాల అధ్యాపకులకు అభించాయి. ఈమేరకు ఈనెల 22న విశాఖపట్నంలో వైస్‌చాన్సలర్ ఆచార్య ప్రసాద్‌రెడ్డి, ఏఐసీటీ ఈ న్యూఢిల్లీ చీఫ్ కోఆర్డినేటర్ బుద్ద చంద్రశేఖర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. కళాశాల చైర్మన్ కళ్లెం ఉపేందర్ రెడ్డి, వైస్‌చైర్మన్ అనూషరెడ్డి, ఏవో ఇక్బాల్, హెచ్‌వోడీలు అవార్డు గ్రహీతలకు అభినందనలు తెలియజేశారు.

ఐదో రోజు 6 నామినేషన్లు దాఖలు

రాజానగరం, ఏప్రిల్ 23 : సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా ఐదో రోజైన మంగళవారం రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు అభ్యర్థులు 6 నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున ముంద్రు వెంకట శ్రీనివాస్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. భారత చైతన్య యువజన పార్టీ తరపున జక్కంపూడి సత్తిబాబు ఒక నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా కుసుమే గాంధీ నామినేషన్ దాఖలు చేశారు. బత్తుల బలరామకృష్ణ అనే అభ్యర్థి నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేశారు.

అనపర్తిలో నాలుగు నామినేషన్లు దాఖలు

అనపర్తి, ఏప్రిల్ 23: అనపర్తిలో మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలు చేశారు. లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున షేక్ సదర్ హుస్సేన్ తన నామినేషన్ పత్రాలను ఆర్వోకు అందజేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వై.శ్రీనివాసరావు నామినేషన్ దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా ఎన్.ప్రవీణ్‌కుమార్ తన నామినేషన్ పత్రాలను ఆర్వో మాధురికి అందజేశారు. అనపర్తి అసెంబ్లీ పరిధిలో మంగళవారం ఒక్కరోజే నాలుగు నామినేషన్లు దాఖలు కావడంతో మొత్తం 8 నామినేషన్లు దాఖలైనట్లు ఆర్వో మాధురి తెలిపారు.

బొమ్మూరులో గోరంట్ల ప్రచారం

రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్23: రాజమహేంద్రవరంరూరల్ ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న గోరంట్ల బుచ్చయ్యచౌదరిని ఎంపబూ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని కోరుతూ టీడీపీ రూరల్ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్ బొమ్మూరులో ఇంటింటా ప్రచారం చేశారు. మంగళవారం మచ్చేటి ప్రసాద్, క్లస్టర్ కామిని భాస్కర్, కామిని ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

కాంగ్రెస్ విజయం ఖాయం

ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



కోరుకొండలో మీడియాతో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజానగరం/కోరుకొండ, ఏప్రిల్ 23: దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఎంపీగా తాను, తన పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు విజయం సాధించబోతున్నామని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. రాజానగరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముంద్రు వెంకట శ్రీనివాస్ నామినేషన్ వేసేందుకు వేళ్లే ముందు మంగళవారం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజుతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దేవస్థానం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, తెలంగాణాలో అధికారంలోకి వచ్చిందని, దీంతో దేశ ప్రజలు సర్వమతాలకు సానూకూలంగా ఉండే కాంగ్రెస్ పట్ల ఆకర్శితులవుతున్నారని తెలిసిందన్నారు. ఏపీలో షర్మిళారెడ్డి నాయకత్వంలో 9 అద్భుతమైన పథకాలు అమలు చేయబోతుందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అద్భుతమైన పది పథకాలను అమలు చేయబోతున్నారన్నారు. అనంతరం ముంద్రు వెంకట శ్రీనివాస్ నామినేషన్ వేసేందుకు నరేంద్రపురం మీదుగా రాజానగరం చేరుకున్నారు. ఆపై పార్టీ కాంగ్రెస్ నాయకులతో కలిసి అక్కడి నుంచి చైతన్య రథంపై ఆర్వో కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీనివాసు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గరగ శ్రీధర్‌బాబు, కురెళ్ల గంగరాజు, కోరుకొండ సర్పంచ్ కర్రి వీరగణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆచరణాత్మక వాగ్దానాలే చేస్తాం

» ఏది చేస్తామో అదే చెబుతాం

» పేదల సంక్షేమానికి అభివృద్ధికి కూటమి కృషి

» రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు



వాసును ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23: ఔటర్ రింగ్ రోడ్డు నిర్మించేస్తాం.. కాకినాడ-రాజమండ్రి కలిపేసి ట్విన్ సిటీస్ చేస్తామనే పిచ్చపిచ్చ వాగ్దానాలు తాను చేయనని, ఆచరణకు సాధ్యమయ్యే వాటినే చెప్పి చేసి చూపిస్తామని టీడీపీ-జనసేన-బీజేపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 48వ డివిజన్ పనస చెట్టు సెంటర్ నుంచి మంగళవారం టీడీపీ నాయకులు కానేటి ప్రభుదాస్, కానేటి కృపామణి, అజ్జరపు రమేష్‌ల ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొని ప్రజలతో మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు సాధకబాధలను తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, కార్మికులు, విద్యార్థులు, చిరు వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్ల వర్తకులు, గృహిణిలను కలిసి ఐదేళ్లుగా వారి పరిస్థితిని ఆరా తీసారు. అనేక సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ఐదేళ్లు ఎన్నో కష్టాలు పడిన మీరు ఆలోచన చేసి మీకు మంచి చేసే కూటమిని అధికారంలోకి తీసుకురావాలని, పేదల సంక్షేమానికి కూటమి కట్టుబడి వుందన్నారు. సూపర్ సిక్స్ మేనిఫెస్టో, లోకల్ మెనిఫెస్టో కరపత్రాలను వారికి ఆదిరెడ్డి శ్రీనివాస్ అందించారు. ఎమ్మెల్యేగా తనకు సైకిల్ గుర్తుపైన, ఎంపీగా దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు సంక్షేమ పథకాలను చేరువ చేసి వారిని అభివృద్ధి చేసి ఆర్థికంగా వారు నిలదొక్కుకునేలా చేయడమే కూటమి లక్ష్యమన్నారు. జగన్ సర్కార్‌లా దోచుకో దాచుకో అక్రమాలు చేసుకో, అరాచకాలు చేసుకో టైపు కూటమి ఉండదని ప్రజల సంక్షేమానికి పాటుపడుతుందని ప్రజా స్వామ్య విలువలను కాపాడుతుందన్నారు. ఇసుక మాఫియా వల్ల ఈ రోజు నిర్మాణ రంగం కుదేలైందన్నారు. లక్షలాది మంది భవ నిర్మాణ కార్మికులు పనులులేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. అన్ని ధరలు పెరిగి ప్రజల బతుకు భారమైందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక పాలసీని తమ నాయకుడు చంద్రబాబు అమలు చేస్తారని, అప్పుడు భవన నిర్మాణ రంగానికి పూర్వవైభవం వస్తుందని కార్మికులకు చేతినిండా పనులు వుంటాయన్నారు. రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దుతామని, పర్యటకంగా అభివృద్ధి చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తామన్నారు. టెంపుల్ టూరిజంను అభివృద్ధి చేస్తామని, సురక్షితమైన తాగునీరు ప్రతి ఇంటికీ అందిస్తామని, క్రీడాకారుల కోసం మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తామని, నగరాన్ని సమగ్ర అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నగరాన్ని దేశంలోనే మోడల్ సిటీగా తయారు చేస్తామని అందుకోసం ప్రజలు తనను ఎమ్మెల్యేగాను, పురందేశ్వరిని ఎంపీగాను గెలిపించాలన్నారు.



వృద్ధుడికి భరోసా కల్పిస్తున్న ఆదిరెడ్డి వాసు

వాకర్స్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం కంబాల చెరువు పార్కులో మంగళవారం ఉదయం 6గంటలకు మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు వాకర్స్‌ను కలిసి వారితో కలిసి నడిచారు. రాజమహేంద్రవరం అభివృద్ధికి వారితో చర్చించారు. నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాల కరపత్రాలు, లోకల్ మెనిఫెస్టో కరపత్రాలను పంపిణీచేశారు. కార్యక్రమలలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆడారి లక్ష్మీనారాయణ, శ్యామల, గుదే రఘునరేష్, జనసేన నాయకులు వెంకటరెడ్డి, మీనాక్షి రెడ్డి, అల్లంకి నాగేశ్వరరావు, చక్రపాణి, పవన్ పాల్గొన్నారు.



కంబాల చెరువు పార్కులో వాకర్స్‌తో మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు

నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23: రాజమహేంద్రవరం ఎంపీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా మేడిసి రత్నరావు, కురువెళ్ల భానుచందర్, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరుపున బత్తుల బలరామకృష్ణుడు, బీఎస్పీ తరుపున పరమట గణేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ స్థానానికి బీఎస్పీ తరుపున పరమట శ్రీఖ, టీడీపీ ఆదిరెడ్డి శ్రీనివాస్ తరపున ఆదిరెడ్డి భవాని, ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, వైసీపీ తరుపున మార్గాని భరత్‌రామ్ మరో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలు కాగా ఇప్పటి వరకు మొత్తం 11 నామినేషన్లు దాఖలు చేశారు.

రాజయోగి గణేష్ ప్రవచనం



రాజమహేంద్రవరం కల్చరల్ ఏప్రిల్ 23: స్థానిక ఏవీ అప్పారావు రోడ్డులోని బాబానగర్‌లో ఉచిత రాజయోగ శిక్షణా కేంద్రంలో మంగళవారం సాయంత్రం బ్రహ్మకుమార్ రాజయోగి గణేష్ (ముంబై) ప్రసంగించారు. అంతచ్ఛేతనా మనసు శక్తి, కర్మ వేదాంతాలను వివరించారు. కార్యక్రమానికి జీఎస్ఎల్ హాస్పిటల్ అధినేత గన్ని భాస్కరరావు, అడిషనల్ ఎస్పీ చెంచురెడ్డి, డీఎస్పీ రత్నస్వామి తదితర ప్రముఖులు విచ్చేశారు. వారికి సంస్థ నిర్వాహకురాలు బీకే సత్యవాణి ఈశ్వరీయ కానుకలందించారు.

జగన్.. బటన్లు నొక్కుడు తప్ప చేసిందేమీ లేదు

● వంగవీటి రాధా, ఎంపీ అభ్యర్థి పురందేశ్వరి, ఆదిరెడ్డి వాసు



మాట్లాడుతున్న పురందేశ్వరి చిత్రంలో వంగవీటి రాధ, వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23: ఐదేళ్లుగా జగన్ బటన్లు నొక్కుతూనే ఉన్నాడని ప్రజలకు చేసిందేమిలేదని వంగవీటి రాధా అన్నారు. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కాలేజీ సెంటర్ నుంచి కంబాలచెరువు చిరంజీవి బస్టాండ్ వరకు భారీ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ట్రైనింగ్ కాలేజి వద్ద జరిగిన కార్యక్రమానికి వంగవీటి రాధా, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి, సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. తొలుత రంగా చిత్రపటానికి నివాళులర్పించారు. రాధా మాట్లాడుతూ రాష్ట్రంలో గడచిన ఐదేళ్లలో పేదల పేరిట పెద్దఎత్తున దోపిడీ చేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమం లేవన్నారు. వేలాది ఎకరాలు దోచి కోట్లు దోపిడీ చేశారన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. రంగ ఆశయాలను సాధించాలన్నారు. ఎమ్మెల్యేగా వాసును, ఎంపీగా పురందేశ్వరిని గెలిపిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పురందేశ్వరి మాట్లాడుతూ తనపై స్థానికేతర ముద్రవేస్తున్నారని కాని స్థానికంగా ఉన్నా ఎంపీ ఏం చేశారని ప్రశ్నించారు. గోదావరి కాలుష్య నియంత్రణకు కేంద్రం రూ.50 కోట్లు నిధులు కేటాయిస్తే ఇప్పటివరకు పనులు ప్రారంభించకపోవడమే ఆయన అంకిత భావమా, గడచిన ఐదేళ్లుగా డ్రగ్స్ మాఫియా పెరిగిందని, బ్లేడు బ్యాచ్‌లు పెరిగాయని, మీరేం చేస్తున్నారని ప్రశ్నించారు. టంగుటూరి ప్రకాశం పంతులు ఇక్కడవారు కాకపోయిన ఈ నగరానికి సేవలందించారని చెప్పారు. ఏపీలో అభివృద్ధి సాధించాలంటే కూటమి అధికారంలోకి రావాలన్నారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ వంగవీటి ఆశయ సాధనకు కృషి చేస్తామన్నారు. అనంతరం అక్కడ నుంచి జనసేన నగర ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, వర్రే శ్రీనివాసరావు, వైజశ్రీను, రెడ్డి మణి, నల్లం శ్రీను, యిన్నమూరి దీపు, యాళ్ళ ప్రదీప్, కోసూరి చండిప్రియ, వెలుగుకుమారి, తంగెళ్ల బాబి తదితర నాయకులు, కార్యకర్తలతో భారీ ర్యాలీ జరిపారు. గాంధీబొమ్మ టౌన్ హాలు రోడ్డు, రామచంద్రరావుపేట మీదుగా కంబాలచెరువు వరకు సాగింది.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమండ్రి ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందరేశ్వరి రాజమహేంద్రవరంలోని శ్రీరాం నగర్‌లో పర్యటించారు. తన భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు, కుటుంబ సభ్యులతో కలసి శ్రీరాం నగర్ ఏరియాలో పర్యటిస్తూ టీడీపీ సీనియర్ నేతలను కలిశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్ని కృష్ణతో భేటీ అయ్యారు. అనంతరం అక్కడున్న వినాయక ఆలయంలో కుటుంబ సమేతంగా దర్శనం చేసుకున్నారు.

200 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరిక

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 23: రాజమహేంద్రవరంలో వైసీపీ నుంచి 200 మంది కార్యకర్తలు టీడీపీలో చేరారు. టీఎన్‌టీయూసీ నగర అధ్యక్షుడు నల్లం శ్రీను, ఉపాధ్యక్షుడు సత్తిబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ చేరికకు ఆదిరెడ్డి శ్రీనివాస్ విచ్చేశారు. వైసీపీకి చెందిన ది ఓల్డ్ ఐరన్ స్క్రాప్ ఆటో రిక్షా వర్కర్స్ యూనియన్ సభ్యులు 200 మందికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నూతనంగా పార్టీలో చేరిన వారంతా అంకితభావంతో కూటమి గెలుపునకు కృషిచేయాలని వాసు అన్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి జిల్లా వార్తలు
బుధవారం 24 ఏప్రిల్ 2024 | 3





ర్యాలీలో జనసేన జెండా పట్టుకుని పవన్ అభివాదం

పవనోత్సాహం



ఇదీ మన గుర్తు

కూటమి అభ్యర్థిని : మూడు పార్టీల కండువాలతో పవన్



కదిలొచ్చిన జనసేన : చేబ్రోలు వద్ద జాతీయ రహదారిపై కిక్కిరిసిన జనసైనికుల ర్యాలీ



పవన్ నామినేషన్ దాఖలు

పిఠాపురాన్ని ఆదర్శంగా చేస్తా..

- అన్నీ ఉన్నా పిఠాపురం అభివృద్ధి కాలేదు
- గెలిచి సమస్యలన్నీ పరిష్కరిస్తా
- మత్స్యకారులకు అండగా ఉంటా
- వైసీపీ అభ్యర్థి గీత వస్తే నిలదీయండి
- ఉప్పాడ సభలో జనసేనాని పవన్

కాకినాడ (ఆంధ్రజ్యోతి)/యు.కొత్తపల్లి, ఏప్రిల్ 23: నియోజకవర్గం అంటే ఇలా ఉండాలి. ఎమ్మెల్యే అంటే ఇలా ఉండాలి అనేలా పిఠాపురాన్ని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పవన్‌కల్యాణ్ ప్రకటించారు. ఎన్నికల ప్రచార సభలో భాగంగా పవన్ మంగళవారం ఉప్పాడ సభలో ప్రసంగించారు. ఉప్పాడ బీచ్‌ను అత్యంత సుందరంగా చేసి చూపిస్తానని పేర్కొన్నారు. ఒకపక్క సముద్రం, మరో పక్క వ్యవసాయం, సెజ్, పోర్టులు అన్నీ ఉన్నా నియోజకవర్గం అభివృద్ధి చెందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గెలిచిన తర్వాత అన్ని రంగాల్లోను పిఠాపురాన్ని మోడల్‌గా తీర్చిదిద్దుతానని ప్రకటించారు. 20 వేల మంది మత్స్యకారులకు ప్రయోజనం చేకూర్చే హార్బర్‌ను వైసీపీ ప్రభుత్వం పూర్తిచేయకుండా మోసంచేసిందని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్యకారులకు వేట నిషేధ పరిహారం పెంపు, వలలు, ఇంజన్లకు సబ్సిడీ దగ్గర నుంచి హార్బర్ పూర్తి వరకు చేసి చూపిస్తామన్నారు. సముద్రపు కోత నివారణకు నిపుణులతో అధ్యయనం చేయిస్తామన్నారు.కాకినాడ సెజ్ బాధితుల బాధలను చూసి రాజకీయాల్లోకి రావాలనుకున్నట్టు చెప్పారు. వారికి అన్ని విధాలా న్యాయం జరిగేలా తాను చూస్తానన్నారు. అరబిందో, దివీస్‌పై పోరాటంలో ముందుంటానన్నారు. కష్టంలో ప్రతి ఒక్కరి భుజం కాస్తానన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి వైసీపీ ఏంచేసిందని ప్రతి ఒక్కరు ప్రశ్నించాలన్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గీతను నిలదీయాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి సునీల్ రాత్రుళ్ల తిరగడం కాదు.. పగలు తిరగాలని చురకలంటించారు. ఉప్పాడ చీరలకు దేశవ్యాప్తంగా ప్రాచుర్యం లభించేలా చేస్తానన్నారు. చేనేత కార్మికులు పస్తులుండకుండా వారికి న్యాయం చేస్తానని తెలిపారు. తనను అసెంబ్లీకి చిన్న మెజార్టీతో కాకుండా భారీ మెజార్టీతో పంపాలని కోరారు. తన నామినేషన్‌కు నియోజకవర్గవ్యాప్తంగా వేలల్లో తరలి వచ్చిన ప్రజలకు అన్ని వేళలా అండగా ఉండి భుజం కాస్తానన్నారు. రిలయన్స్‌జీఎస్‌పీసీ, ఓఎన్జీసీ కంపెనీల నుంచి పరిహారం అందేలా చేస్తానన్నారు. తుఫాన్ షెల్టర్లను ఆధునీకరిస్తామని,అరబిందో ఫార్మా వ్యర్థజలాలు సముద్రంలో కలవకుండా పోరాడతానన్నారు.

అందరి భాగస్వామ్యంతో అభివృద్ధి..

పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పవన్ వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యే వర్మను చట్టసభల్లోకి పంపి ఆయనకు తగిన గౌరవం లభించేలా చేసే బాధ్యత తనదన్నారు. 'పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తన సీటును నా కోసం త్యాగం చేశారు. ఆయనకు నా కృతజ్ఞతలు, నమస్కారాలు తెలుపుతున్నా. భవిష్యత్తులో ఆయన ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరుకుంటున్నా. దానికి నా కృషి కూడా ఉంటుంది' అని పవన్‌కల్యాణ్ తెలిపారు. నామినేషన్‌కు భారీగా టీడీపీ శ్రేణులు రావడం ఆనందంగా ఉందన్నారు.కలిసి పనిచేయడంతో విజయం సాధించడం సులువని పేర్కొన్నారు. వర్మతో పాటు మరికొందరు నేతలను పవన్ ఆలింగనం చేసుకున్నారు.తమది మూడు పార్టీల హామీ అని, జగన్‌లా ఒక పార్టీ హామీ కాదన్నారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే వర్మ మాట్లాడుతూ చంద్రబాబు ఆదేశాలతో పవన్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.ఆయన స్థానికేతరుడని వైసీపీ ఆరోపిస్తున్నా రాష్ట్ర అధ్యక్షుడు ఎక్కడి నుంచైనా పోటీచేస్తారన్నారు.ఎమ్మెల్యే వైసీపీ అభ్యర్థిని వంగా గీత ఐదేళ్లలో ఏరోజు పిఠాపురం రాలేదని ధ్వజమెత్తారు. అనంతరం ఉప్పాడ సెంటర్ నుంచి గోర్స, కొమరగిరి మీదుగా పిఠాపురం- గొల్లప్రోలు బైపాస్ మీదుగా చేబ్రోలులోని తన ఇంటికి పవన్ చేరుకున్నారు.



ఉప్పాడ బహిరంగ సభలో అభివాదం చేస్తున్న పవన్, ఎంపీ అభ్యర్థి శ్రీనివాస్, వర్మ, కృష్ణంరాజు



విజయీభవ : పవన్‌ను ఆశీర్వదిస్తున్న నాగబాబు, వర్మ దంపతులు



ఇది మన జెండా..



ర్యాలీలో భాగంగా పవన్ అభివాదం

కదిలిన..జనసేన

పిఠాపురం/రూరల్/గొల్లప్రోలు,ఏప్రిల్23: జన కెరటం ఉప్పొంగింది. రహదారులన్నీ జనసంద్రమయ్యాయి. అడుగడుగునా యువత, మహిళలు, ప్రజలు నీరాజనాలు పలికారు. హారతులు పట్టారు. పూలవర్షం కురిపించారు. వేలాదిగా తరలివచ్చిన జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, బీజేపీ కేడర్‌తో కలిసి భారీ ర్యాలీతో తరలివచ్చి పవన్‌కల్యాణ్ నామినేషన్ దాఖలు చేశారు. పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ మంగళవారం చేపట్టిన ర్యాలీకి అపూర్వ స్పందన లభించింది. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని తన నివాసం నుంచి పవన్ బయలుదేరి చేబ్రోలు బైపాస్‌రోడ్డులో నుంచి 216వ జాతీయ రహదారిపై చెందుర్తి, తాటిపర్తి జంక్షన్ల మీదుగా గొల్లప్రోలు పట్టణంలోని బైపాస్ వై.జంక్షన్ వద్దకు చేరుకున్నారు. అక్కడి నుంచి పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్ వద్దకు చేరుకుని తిరిగి గొల్లప్రోలు తహసీల్దార్ కార్యాలయ సెంటర్‌కు వచ్చారు. భారీ జనసందోహం మధ్య ర్యాలీని ప్రారంభించారు. చేబ్రోలు నుంచి గొల్లప్రోలు వరకూ ఓపెన్‌టాప్ కారులో పవన్ వచ్చారు. ఓపెన్‌టాప్ జీపులో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీ ఎస్ఎన్ వర్మ, బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి నాగబాబు ఉన్నారు. గొల్లప్రోలు పట్టణంతో పాటు గొల్లప్రోలు టోల్‌ప్లాజా మీదుగా పిఠాపురంలోకి ర్యాలీ ప్రవేశించింది. ర్యాలీ పొడవునా ప్రజలకు పవన్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. మహిళలు పూలవర్షం కురిపించారు. పలుచోట్ల మహిళలు హారతులిచ్చారు. పిఠాపురంలోని కోర్టులవద్ద న్యాయవాదులు, పశువుల సంతవద్ద రెల్లి కులస్థులు స్వాగతం పలికారు. పిఠాపురంలో కిలోమీటరు మేర రోడ్‌షోకే గంటకు పైగా సమయం తీసుకుంది. సమయం మించిపోతుండడంతో సాయిబాబా గుడి సెంటర్‌లో వేరొక వాహనంలో పిఠాపురం మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని పవన్ నామినేషన్ దాఖలు చేశారు. పవన్ ర్యాలీ సాగిన 216వ జాతీయ రహదారితో పాటు పిఠాపురం, గొల్లప్రోలు పట్టణ రోడ్లన్నీ జనసునామీని తలపించాయి. కిలోమీటరున్నర పొడవునా మోటార్‌సైకిళ్లు, కార్లు, ఇతర వాహనాల్లో జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీజేపీ కేడర్ అనుసరించారు. 14 కిలోమీటర్ల మేర ర్యాలీ సాగింది. పవన్‌కల్యాణ్ చేబ్రోలు నివాసం నుంచి నామినేషన్ వేసేందుకు బయలుదేరుతున్న సమయంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ సతీమణి లక్ష్మీదేవి హారతులిచ్చారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన పార్టీ నేత నాగబాబు ఆశీస్సులు అందించారు. బ్రాహ్మణులు ఆశీర్వచనాలు పలికారు. క్రైస్తవ సోదరిమణులు దీవెనలు అందజేశారు.



ఆదిరెడ్డి శ్రీనివాస్ తరఫున నామినేషన్ దాఖలు చేస్తున్న ఎమ్మెల్యే భవాని

ఉమ్మడి తూర్పుగోదావరిలో 91 నామినేషన్లు

సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఐదో రోజైన మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి (నిడదవోలు, గోపాలపురం, కొవ్వూరులతో కలిపి) జిల్లాలో మొత్తం 91 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో లోక్‌సభలకు 14, అసెంబ్లీలకు 77 ఉన్నాయి.

'తూర్పు'లో లోక్‌సభకు 4, అసెంబ్లీ స్థానాలకు 25 నామినేషన్లు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలోని రాజమహేంద్రవరం లోక్‌సభకు నాలుగు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 25 నామినేషన్లు మంగళవారం దాఖలైనట్టు జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. రాజమహేంద్రవరం లోక్‌సభకు స్వతంత్ర అభ్యర్థిగా మెడిసి రత్నారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ తరఫున ఆయన ప్రతిపాదకుడు, బీఎస్పీ అభ్యర్థిగా పరమట గణేశ్వరరావు, స్వతంత్ర అభ్యర్థిగా కుర్రెళ్ల భానుచందర్ నామినేషన్లు దాఖలు చేశారు. అనపర్తి నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తరఫున తేతలి అబ్బుస్‌రెడ్డి, స్వతంత్ర అభ్యర్థిగా ఎన్.ప్రవీణ్‌కుమార్, లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున షేక్ సదర్ హుస్సేన్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున వై.శ్రీనివాసరావు నామినేషన్లు దాఖలుచేశారు. రాజానగరం నియోజకవర్గం నుంచి భారత చైతన్య యువజన పార్టీ తరఫున జక్కంపూడి సత్తిబాబు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరఫున ముద్రు వెంకటశ్రీనివాస్, స్వతంత్ర అభ్యర్థిగా బత్తుల బలరామకృష్ణ నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా ఆదిరెడ్డి వాసు తరఫున, ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, వైసీపీ అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ తరఫున మార్గాని సురేష్, బీఎస్పీ అభ్యర్థిగా పరమట సురేఖ నామినేషన్లు దాఖలు చేశారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా బాలేపల్లి మురళీధర్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. కొవ్వూరు ఎస్సీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా మెల్ల కమల ఉరఫ్ ఆరుగొలను కమల, ఉబా శ్రీకాంత్, బొంతా కిశోర్, కొక్కిరిపాటి చినబాబు నామినేషన్లు దాఖలుచేశారు. నిడదవోలు నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థిగా కందుల లక్ష్మీదుర్గేష్ ప్రసాద్ తరఫున ప్రశాంత్ శ్రీనివాస్, బీఎస్పీ అభ్యర్థులుగా జి.చిత్రసేను, బయ్యే మునేశ్వరరావు నామినేషన్లు దాఖలు చేశారు. గోపాలపురం నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా మద్దిపాటి వెంకటేశ్వరరావు, పెనుమాక వినోదకుమారి, బీఎస్పీ అభ్యర్థిగా సిర్రా భరతరావు, స్వతంత్ర అభ్యర్థిగా దొడ్డిగర్ల నాగార్జున నామినేషన్లు దాఖలు చేశారు.

అమలాపురం లోక్‌సభ స్థానానికి బోణీ

అమలాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ఘట్టంలో ఐదో రోజైన మంగళవారం అమలాపురం లోక్‌సభ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్ల నామినేషన్లు సమర్పించినట్టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షుశుక్లా తెలిపారు. రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ (సెక్యులర్) తరఫున బూసిం రమణమ్మ ఒక సెట్, వైసీపీ తరఫున రాపాక వరప్రసాదరావు రెండు సెట్‌లు, లిబరేషన్ కాంగ్రెస్‌పార్టీ తరఫున యడ్ల రాజేష్ ఒక సెట్, స్వతంత్ర అభ్యర్థిగా ఇసుకపట్ల ఇమ్మానియేల్ కుమార్ ఒక సెట్, బహుజన సమాజ్ పార్టీ తరఫున యాళ్ల దొరబాబు రెండు సెట్‌లు, స్వతంత్ర అభ్యర్థిగా గుదే వెంకటేశ్వర్లు ఒక సెట్ నామినేషన్లు దాఖలు చేశారు,

కాకినాడ లోక్‌సభకు పల్లంరాజు నామినేషన్

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్23: కాకినాడ జిల్లాలోని కాకినాడ లోక్‌సభ స్థానానికి ఆరు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు 26 నామినేషన్లు మంగళవారం దాఖలయ్యాయి. కాకినాడ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మల్లిపూడి మంగపతి పల్లంరాజు నాలుగు సెట్లు దాఖలు చేయగా.. స్వతంత్రులు, ఇతర పార్టీలకు చెందిన మరో ఐదుగురు అభ్యర్థులు కూడా తమ నామినేషన్లను దాఖలు చేశారని అధికార వర్గాలు తెలిపాయి.

ఇది జగన్ బ్రాండ్ కథ..



గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీల్లో మరొక నవరత్నం.. మద్య నిషేధం. టీడీపీ హయాంలో మద్యం ఏరులైపారుతోందని, తాను మద్యం నిషేధం అమలుచేసి ఆయా కుటుంబాల్లో సంతోషం నింపుతానని పాదయాత్ర సందర్భంగా జగన్ పదేపదే చెబుతూ వచ్చారు. కానీ జరిగిందేంటి?...

గత ప్రభుత్వంలో రూ.60 ఉన్న చీప్‌లిక్కర్ రూ.120కి చేరింది. ఇప్పుడు రూ.150 చేసింది. నిజానికి కాయకష్టం చేసుకునే పేదవర్గాలంతా తాగే మందు ఇదే. కాస్త బ్రాండ్ మద్యమైతే రూ.120 నుంచి రూ.220కి చేరింది. దాంతో మందుబాబులంతా అల్లాడిపోయారు. సంపాదించిన సొమ్మంతా మందు కొట్టుకే అప్పజెప్పారు. ఇదేంటని నిలదీస్తే, మద్య నిషేధం కోసమే తాము రేట్లు పెంచామని వైసీపీ సర్కార్ సరికొత్త భాష్యం చెప్పింది. ఇదేం తెలివి.. ఉన్న సొమ్మంతా మద్యానికే యజమాని పోస్తున్నాడని మహిళలూ గగ్గోలు పెట్టారు. ప్రభుత్వం మాత్రం బడుగు జీవులకు నాణ్యత లేని మద్యం పోసి వందల కోట్లు లాగేసింది.

ఇక బ్రాండ్ల బాగోతం. దశాబ్దాల తరబడి ఉన్న బ్రాండ్లన్నీ మాయమయ్యాయి. బూంబూం అంటూ బీర్, ఏవో రకరకాల పేర్లతో చీప్ లిక్కర్, చివరకు ఖరీదైన మద్యంలోనూ 'జే' బ్రాండ్ల మద్యం.. చీప్ లిక్కర్ తాగిన వారంతా జగన్‌ని తిట్టని రోజు లేదు. పచ్చి మందు తెచ్చి తమ ప్రాణాలు హరిస్తున్నారంటూ మద్యపానీయులంతా గగ్గోలు పెట్టని ఊరు లేదు.

వైసీపీ ప్రభుత్వ హయాంలో విచ్చలవిడిగా సాగిన మత్తు వ్యాపారం మరొకటుంది. కాలేజీ పిల్లల నుంచి ఏదొక పనిచేసుకునే యువకుల వరకు ఇప్పుడు గంజాయి మత్తులో జోగుతున్నారు. ఇది మన గోదావరి జిల్లాల్లో ఇప్పటికే చుట్టుముట్టేసింది. మన పిల్లల భవిష్యత్తుని ఛిద్రం చేసే దిశగా తీసుకెళ్లిపోతోంది. దీని వెనుక ఎవరున్నారో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అటు కాకినాడలోను, ఇటు రాజమహేంద్రవరంలోనూ గంజాయి వ్యాపార వ్యవహారాల్లో వైసీపీ నేతల అండదండలుండడం బహిరంగ రహస్యమే.



- నాడు మద్య నిషేధమంటూ జగన్ హామీ
- లేకపోతే 2024లో ఓట్లు అడగనని ప్రతిన
- నాలుగు రెట్లు పెంచి పేదలను పీల్చేసిన వైనం
- 'జే' బ్రాండ్ల మద్యంతో అనారోగ్యం
- మళ్లీ సారా వైపు మళ్లిన కష్టజీవులు
- ఉమ్మడి జిల్లాల్లో విచ్చలవిడిగా గంజాయి
- ఈ మత్తు సామ్రాజ్యం వెనుక వైసీపీ నేతలు

రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)/కాకినాడ సిటీ/పిఠాపురం/ఆత్రేయపురం: గత అసెంబ్లీ ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీల్లో దశల వారీగా మద్య నిషేధం ఒకటి.2019 మే 26న తన ప్రమాణ స్వీకారానికి ప్రధానిని, ఇతర ప్రముఖులను ఆహ్వానించడానికి జగన్ ఢిల్లీ వెళ్లారు. అప్పుడు అక్కడి మీడియా సమావేశంలో మాట్లాడగా వైసీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన మద్యపాన నిషేధ హామీపై పాత్రికేయులు ప్రశ్నించారు. అప్పుడు జగన్ 'మద్యపాన నిషేధానికి సంబంధించి నేను చాలా క్లియర్‌గా చెప్పాను. దశల వారీ పద్ధతుల్లో నిషేధిస్తాం. మరో వైపు పునరావాస కేంద్రాలను పెంచాలి. అవి చేసుకుంటూపోయి 2024 ఎన్నికల సమయానికి కచ్చితంగా మద్యాన్ని ఫైవ్ స్టార్ హోటల్స్‌కి మాత్రమే పరిమితం చేసిన తర్వాతే నేను ఓట్లు అడుగుతాను.' అని సెలవిచ్చారు. ఇప్పుడు వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే.. దానికి పూర్తిగా భిన్నమైన పరిస్థితి ఉంది. మద్యపాన నిషేధ హామీని అమలు చేయలేకపోగా మద్యంపై వచ్చే ఆదాయాన్ని పరుగులు పెట్టించారు.సొంత బ్రాండ్లను, నాణ్యతలేని సరుకు విక్రయించారు.పేదబడుగు వర్గాలు తాగే చీప్ లిక్కర్‌ను నాలుగు రెట్లు పెంచి దోపిడీ చేశారు. దేశంలో ఏ సీఎం చేయని విధంగా మద్యంపై రానున్న 15 ఏళ్లలో వచ్చే మద్యం ఆదాయాన్ని తాకట్టుపెట్టి వేల కోట్ల రూపాయలు అప్పు తెచ్చి చరిత్రలో నిలిచారు. అంటే మద్య నిషేధం ఆలోచన రాబోయే 15 ఏళ్లలో కూడా తనకు లేదని స్పష్టంగానే చెప్పారు జగన్.

రూ.25కే సారా ప్యాకెట్

మందు రేట్లు పెంచేయడంతో సారా విచ్చలవిడిగా పెరిగిపోయింది. పైగా మందు నాణ్యత లేక కిక్కు ఎక్కడం లేదంటూ సారా వైపు మందుబాబులు మళ్లారు. రూ.150 పెట్టి క్వార్టర్ మందుకొనడం కన్నా రూ.25 పెట్టి సారా ప్యాకెట్టు కొనడం బెటరు. కేవలం మందు రేట్లు పెంచడం, నాణ్యత లేకపోవడం వల్లే సారా తాగుతున్నామని మందుబాబులు చెబుతున్నారు.

పెంచెయ్..తాగించెయ్

గత ప్రభుత్వంలో నిర్దిష్టమైన మద్యం పాలసీ ఉండేది. అప్పుడు క్వార్టరు (180 ఎంఎల్) బ్రాండ్ మద్యం రూ.120కే దొరికేది.వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ ధరను అమాంతం రూ.200 చేసేశారు. 'జే' బ్రాండ్లతో షాపులను నింపేశారు. తర్వాత దశల వారీగా అమ్మకాలు ఎక్కువగా ఉన్న బ్రాండ్లకు మళ్లీ క్వార్టరుకు రూ.20.. తర్వాత రూ.10 అదనంగా తగిలించారు.ఇలా క్వార్టరు రూ.230 అయిపోయింది. సారా వల్ల ఆరోగ్యాలను ఇబ్బంది కలుగుతోందని గ్రహించిన గత ప్రభుత్వ పాలకులు చీప్ లిక్కర్‌ని ప్రమాణాల ప్రకారం డిస్టిలరీల్లో తయారుచేయించి రూ.60 లకే విక్రయించేవారు.ఇప్పుడు రూ.150కి విక్రయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో లైసెన్సు పొందిన మందు షాపులు ఉండేవి. ఎం ఆర్పీపై ఒక్క రూపాయి కూడా అధికంగా వినియోగదారుల నుంచి తీసుకోకుండా ప్రభుత్వమే వ్యాపారస్తులకు 15 శాతం కమిషన్ ఇచ్చేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ విధానాన్ని తీసేసింది.ఎంఆర్పీపై ఎంత ఎక్కువకైనా అమ్ముకోవచ్చంటూ బార్‌లకు ధరలను ధారాదత్తం చేస్తూ ఆదే శాలిచ్చేసింది. దీంతో గత ప్రభుత్వంలో రూ.60కి దొరికే చీప్ లిక్కర్ ఇప్పుడు బార్‌లో కొనాలంటే రూ.210 అవుతోంది. రోజంతా కష్టబడితే రూ.500 వస్తే గతంలో సుమారు రూ.400 ఇంటికి తీసుకెళ్లేవారు. మద్యం అలవాటు ఉన్న వాళ్లు ఇప్పుడు రూ.100 కొంపకు చేర్చడం కష్టమవుతోంది. దీంతో కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి. పైగా నాణ్యత లేని మద్యం, కల్తీ మద్యం వల్ల ఆరోగ్యాలు దెబ్బతింటున్నాయి.

ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సరుకు ఉండడం లేదు. బార్‌లలో మాత్రం మద్యం ఫుల్‌గా లభ్యమవుతోంది. ఇదే అదనుగా అనధికారికంగా ధరలు పెంచేశారు. వైసీపీ వచ్చాక క్వార్టరు క్రమంగా రూ.230కి చేరింది. దానికి మరో రూ.60 అదనంగా కలిపి బార్‌లలో రూ.290 తీసుకునేవాళ్లు. ఇప్పుడు ప్రభుత్వ మద్యం దుకాణాల్లో మందు లేక పోవడంతో బార్‌లలో రద్దీ పెరిగింది. వైసీపీ మద్యం పాలసీతో ఐదేళ్లుగా నష్టాలు చవిచూస్తున్న బార్‌ల యజమానులు ఇదే అదనుగా మళ్లీ ధరలు పెంచేశారు.ఎక్కువ విక్రయించే బ్రాండ్లపై రూ.10-30 పెంచేశారు.అంటే గత ప్రభుత్వంలో రూ.120కి దొరికే బ్రాండ్ మద్యం క్వార్టరు ఇప్పుడు రూ.310 అయిందన్నమాట. గత ప్రభుత్వంలో రూ.100కి లభ్యమయ్యే బీరు ఇప్పటికే ప్రభుత్వ దుకాణంలో రూ.220,బార్‌లో రూ.330 అయిపోయింది.తూర్పుగోదావరి జిల్లాలోనే మద్యం అమ్మకాలు నెలకు రూ.100 కోట్లు దాటాయంటే జనం సొమ్ము ఎంత పెద్దగా వైసీపీ సర్కారు ఖజానాకు జమైందో అర్థం చేసుకోవచ్చు.

30 గ్రాములు.. మూడొందలు!

జగ్గంపేట : గంజాయి ఎక్కడపడితే అక్కడ దొరుకుతోంది. బ్రాండ్ మద్యం క్వార్టర్ రూ.230కి విక్రయిస్తుండగా, 30 గ్రాముల గంజాయి ప్యాకెట్ రూ.300 ఉంది. క్వార్టర్ మందు ఇచ్చే కిక్‌కన్నా 30 గ్రాముల గంజాయి ఇచ్చే కిక్‌కే యువత అలవాటుపడుతున్నారు. మైనర్లు సైతం ఈ రక్కసికి చిక్కుతున్నారు. కొన్ని కిళ్లీకొట్లలో సైతం గంజాయి దొరుకుతుందంటే ఏ స్థాయిలో విస్తరించిందో అర్థంచేసుకోవాలి.

గంజాయి విచ్చలవిడిగా..

ఈ ఐదేళ్లలో పట్టణాలతో పాటు గ్రామాల్లోనూ గంజాయి కోరలు చాచింది. యువత జీవితాలను చిత్తు చేసింది. ఇంజనీరింగ్ విద్యార్థులు గంజాయి రవాణాకు అలవాటుపడ్డారు. మైనర్లు గంజాయికి అలవాటుపడ్డారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గంజాయి మత్తుకు చాలా మందిని బానిసలుగా చేశారు.కోనసీమలోని కొంతమంది యువకులు గంజాయి అలవాటుపడి మత్తులో జోగుతున్నారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో గంజాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నా చర్యలు లేవు.ఇటీవల ప్రజాగళం ప్రచారంలో టీడీపీ అధినేత చంద్రబాబు కోనసీమలో గంజాయి మత్తుకు బానిసై యువత భవిష్యత్ నిర్వీర్యమవుతోందని, గంజాయి స్మగ్లర్లకు వైసీపీ నేతల అండదండలు ఉన్నాయంటూ బహిరంగంగానే ఆరోపణాస్త్రాలు సంధించారు.గత ప్రభుత్వంలో గంజాయి సాగు ధ్వంసం నిరంతరాయంగా జరిగేది. సాగు చేస్తున్న గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపించంతో అప్పట్లో గంజాయి సాగు తగ్గుముఖం పట్టింది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక అలాంటివి పడకేశాయి. రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో గంజాయి కేసుల్లో సుమారు 600 మంది ఖైదీలు ఉన్నారు. వీరిలో అధికశాతం గిరిజనులే ఉన్నట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఆ పార్టీ నాయకుల అక్రమ వ్యాపారాలకు అడ్డు లేకుండా పోయింది. గంజాయి వ్యాపారంలోను వారు బాగా రాణించారు.

గంజాయిలో వివాదాల్లో వైసీపీ నేతలు

గంజాయి వ్యవహారాల్లో వైసీపీ నేతల ప్రమేయంపై ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పెద్ద యుద్ధమే జరుగుతోంది. రాజమహేంద్రవరంలో బ్లేడ్ బ్యాచ్‌లు చెలరేగిపోవడానికి గంజాయి దురలవాట్లే కారణమని పోలీసులే తేల్చారు. వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరుల ప్రమేయం ఉందని ప్రతిపక్ష పార్టీలు ఆరోపణలు చేశాయి. కాకినాడ లోనూ గంజాయి వ్యవహారాల్లో సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రమేయ ముందంటూ దుమారమే చెలరేగింది. టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ నేరుగా ఆరోపణాస్త్రాలు సంధించారు. కాకినాడ సంజయ్‌నగర్ డంపింగ్ యార్డులో గంజాయి నిల్వల వెనుక ఎమ్మెల్యే ద్వారంపూడి ప్రమేయముందని స్థానిక ప్రజలు, మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత టీడీపీ కూటమి అభ్యర్థి కొండబాబు గతంలోనే ఆరోపణలు చేశారు. గతేడాది జూన్ 14న మీడియాను డంపింగ్‌యార్డు వద్దకు తీసుకెళ్లి చెత్తగుట్టల కింద గంజాయి ఉందని ఆరోపిస్తే పోలీసులు కొండబాబునే అదుపులో తీసుకోవడం విశేషం.

కూటమి అభ్యర్థులను గెలిపించండి

టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి కందుల దుర్గేష్



వృద్ధులను పలకరిస్తున్న కందుల దుర్గేష్

పెరవలి, ఏప్రిల్ 23: టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్‌కు అడుగడుగునా మహిళలు నీరాజనాలు పలికారు. మంగళవారం ముక్కామల , ముమ్మిడివారిపాలెం, ముత్యాలవారిపాలెం, ఓడూరువారిపాలెం, గవర్లపాలెం గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున రోడ్ల మీదుకు వచ్చి హారతులిచ్చి స్వాగతం పలికారు. మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఉన్న చోట్ల దుర్గేష్, శేషారావు వారి వద్దకు వెళ్లి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారితో మహిళలు ఫొటోలు తీయించుకోవడానికి పోటీ పడ్డారు. టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు మోటారుసైకిల్ ర్యాలీ నిర్వహించారు. కమలం, సైకిల్ గుర్తులపై ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు భూపతిరాజు రవివర్మ, అతికాల శ్రీను, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, వేంద్ర వెంకట రమణమూర్తి, వీరేష్‌బాబు, ముత్యాల రాము, నల్ల సురేంద్ర, నల్లాకుల వెంకటేశ్వరరావు, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, హనుమంతు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి

కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు



ఎస్.ముప్పవరంలో ముప్పిడికి హారతిస్తున్న మహిళ

చాగల్లు, ఏప్రిల్ 23: టీడీపీ-జనసేన-బీజేపీ ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధిసాధ్యమని నియోజకవర్గం అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం మండలంలోని ఎస్.ముప్పవరం, దారవరం, కలవలపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి బాబు షూరిటీ, బవిష్యత్ గ్యారంటీపై ప్రచారం చేశారు. చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వంతోనే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం కలుగుతుందన్నారు. చాగల్లులో టీడీపీ నాయకులు కాపుల గుడి వీధిలో ఎన్నికల ప్రచారం నిర్వహించి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్, కరుటూరి సతీష్, కేతా సాహెబ్, దొంగ రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ, ఊబా దుర్గ, పొలిశెట్టి శ్రీనివాసరావు, అల్తాఫ్ అహ్మద్, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్ జూన్ 29కి వాయిదా

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికలు తదితర కారణాల వల్ల మే 11న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ని జూన్ 29న నిర్వహిస్తారని జిల్లా 9వ అదనపు న్యాయమూర్తి ఎం.మాధురి తెలిపారు. మంగళవారం వివిధ బీమా సంస్థలతో సమావేశమై మోటారు వాహనాల ప్రమాదాల కేసులు అధిక మొత్తంలో పరిష్కారం కావడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పెండింగ్‌లో ఉన్న అలాంటి కేసుల వివరాల జాబితాను డీఎల్ఎస్ఏకి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్లాపస్ చైర్మన్ ఎ.గాయత్రి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె.ప్రకాశ్‌బాబు పాల్గొన్నారు

వలలో పడలేదు!

» వలంటీర్లకు పడని ఫ్యాన్ గాలి
» వైసీపీ ఒత్తిళ్లకు లొంగని వైనం
» 29.4 శాతమే రాజీనామా
» 70.6 శాతం మంది నిలబడే ఉన్నారు
» ఫలించిన చంద్రబాబు వ్యూహం
» వలంటీర్లకు నెలకు రూ.10 వేలు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీ వలకు చిక్కలేదు.. నాయకుల ప్రలోభాలకు లొంగలేదు.. అధిష్ఠానం ఆదేశాలు పట్టించుకోలేదు.. మరో రెండు రెట్లు జీతం పెంచి ఇస్తామన్నా వద్దు పొమ్మంటున్నారు.. తెలిసి తెలిసి ఎవరైనా పాము పుట్టలో వేలు పెడతారా.. ప్రస్తుతం వలంటీర్లు అదే చేస్తు న్నారు.. మీ గాలి మాకొద్దు.. మా జోలికి రావొద్దంటూ దూరంగా పోతున్నారు. దీంతో జగన్ ఒకటి తలిస్తే వలంటీర్లు మరొకటి తల చారంటూ నాయకులు తలలు పట్టుకుంటున్నారు. ఉద్యోగాలు లేక ఉపాధి కోసం వలంటీర్లగా సేవ చేయడానికి ముందుకు వచ్చిన యువతీ యువకులను వైసీపీ అడ్డగోలు పనులకు ఉపయోగించు కోవాలని ప్రయత్నించిన సంగతి తెలిసిందే. చివరకు ఎన్నికల్లో కూడా వారి సేవలను దుర్వినియోగం చేసే ప్రయత్నం చేయడం గమనించి ఎన్నికల కమిషన్ వారిని ఎన్నికల విధులకు, సంక్షేమ పథకాల పంపిణీలకు దూరంగా ఉంచింది. ఇతర ప్రత్యామ్నాయ మార్గాల్లో లబ్ధిదారులకు ఇబ్బందిలేకుండా చూడాలని ఆదేశించింది. అయితే ఈ నెల ఒకటో తేదీన పించన్లు పంపిణీకి అడ్డంకులు సృష్టించి ఆ నెపాన్ని ప్రతిపక్షాల మీద వేయాలని వైసీపీ విఫల యత్నం చేసింది. తర్వాత వలంటీర్ల చేత బలవంతంగా రాజీ నామాలు చేయించి, వారికి పార్టీ కండువాలు కప్పి ఎన్నికల్లో ఉపయోగించుకోవాలని ప్రయత్నించింది. కొందరు వలంటీర్లకు ఈ ఎన్నికల నెలలో రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకూ జీతం ఇస్తామని ప్రలోభపెట్టి రాజీనామా చేయించింది.కానీ అంతకు ముందు జీతాలు పెంచమని కోరినందుకు అనేక మందిని వైసీపీ నేతల ఒత్తిడితో అధికారులు తొలగించిన సంగతి తెలిసిందే. ఈ పరిస్థితుల్లో వైసీపీ మాటలను ఎక్కువ మంది వలంటీర్లు నమ్మడం లేదు. వైసీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు వలంటీర్లు లొంగడం లేదు. ఇంతలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి తరపున టీడీపీ అధినేత,మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తామని, పైగానెలకు రూ.10వేలు గౌరవ వేతనం ఇస్తామని, అంతేకాక తాము అధికారంలోకి రాగానే వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి పోత్సహిస్తామని సూచించారు. కానీ వైసీపీ తప్పుడు మాటలకు, ప్రలోభాలకు లొంగి తప్పుడు పనులు చేయవద్దని పిలుపు ఇచ్చిన సంగతి తెలిసిందే. చంద్రబాబు చెప్పిన ఈ మా టలు ఎక్కువ మంది వలంటీర్లకు నచ్చాయి. దీంతో వైసీపీ నేతలు ఎంత ఒత్తిడి తెచ్చినా ఎక్కువ మంది ఏదో కారణంచెప్పి తప్పించు కుంటున్నారు. రాజీనామాలు చేయడం లేదు. కొందరైతే తిరగబడు తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో మొత్తం 9099 మంది వలం టీర్లు ఉండగా ఇప్పటి వరకూ కేవలం 2,675 మంది రాజీనామా చేశారు. ఇది కేవలం 29.4 శాతమే. కొన్ని తప్పులు చేయడం వల్ల 30 మందిని అధికారులు తొలగించారు. ఇంకా 6394 మంది వలంటీర్లుగానే ఉన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటిస్తూ, ఆయా డ్యూటీలకు దూరంగా ఉన్నారు. కొవ్వూరు అర్బన్‌లో ఒక్కరు కూడా రాజీనామా చేయకపోవడం గమనార్హం. దేవరపల్లిలో ఒక రిని, గోపాలపురంలో ఇద్దరిని, నల్లజర్లలో ఒకరిని, రాజమహేంద్ర వరం అర్బన్‌లో 24 మందిని, సీతానగరంలో ఇద్దరిని అధికారులు వివిధ కారణాల వల్ల తొలగించారు. రాజమహేంద్రవరంలో కేవలం 17 మంది రాజీనామా చేయగా 1526 మంది రాజీనామా చేయ కుండా నిలబడ్డారు. నిడదవోలు రూరల్‌లో 310 ఉండగా అక్కడ నేతలు 307 మంది చేత రాజీనామా చేయించారు. కానీ ముగ్గురు లొంగలేదు. నిడదవోలు నియోజకవర్గంలో అత్యధికంగా 1033 మం దితో వైసీపీ నేతలు రాజీనామాలు చేయించారు. గోపాలపురం నియోజకవర్గంలో మంత్రి తానేటి వనిత పరిధిలో 392 మంది , రాజానగరంలో 391 మంది, రూరల్ నియోజకవర్గంలో 343 మంది తో రాజీనామా చేయించారు. ప్రస్తుతం అన్ని సర్వేలు టీడీపీ-జనసేన-బీజేపీ కూటమే అధికారంలోకి వస్తున్నట్టు తేల్చేస్తు న్నాయి. ఈ పరిస్థితుల్లో రాజీనామాలు చేసి వలంటీర్లకు పాపం ఇబ్బందే. మిగతా వలంటీర్లంతా ఆనందంగా ఉన్నారు. జీతాలు పెంచాలని కోరినప్పుడు సస్పెన్షన్‌కు గురైనవారు కూడా టీడీపీ నేతలతో మంతనాలు చేస్తున్నట్టు సమాచారం.



అరాచక పాలనకు ఓటుతో చరమగీతం పాడాలి

» కూటమి అభ్యర్థుల విజయానికి పెన్షనర్లు కృషి చేయాలి
» ఏపీఎన్జీవో సంఘం మాజీ కార్యదర్శి విజ్‌డం చౌదరి

కొవ్వూరు, ఏప్రిల్ 23: ఐదేళ్లుగా రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు ఓటు ద్వారా చరమగీతం పాడాలని ఏపీ ఎన్జీవో సంఘం మాజీ కార్యదర్శి జి.విజ్‌డం చౌదరి అన్నారు. కొవ్వూరులోని రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారుల కార్యాలయంలో సంఘం అధ్యక్షుడు ఎం.రామచంద్రరావు ఆధర్యంలో సమావేశం నిర్వహించారు. ఏపీ పునర్నిర్మాణం, పెన్షనర్ల సంక్షేమం చంద్రబాబు గెలుపు పెన్షనర్ల పిలుపు కరపత్రాన్ని ఆవిష్కరించారు. విజ్‌డం చౌదరి మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షనర్లు 90శాతం వారి పెన్షన్ మీదే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ప్రభుత్వాలు సామాజిక పింఛన్లు 1వ తేదీనే అందిస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్నప్పటికీ పదవి విరమణ పొందిన ఉద్యోగులకు రావలిసిన పింఛను 15వ తేదీ వరకు ఇవ్వకుండా బిచ్చగాళ్లగా చూస్తున్నాయన్నారు. హక్కులను ప్రశ్నించిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులను అక్రమ అరెస్టులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ఇటువంటి విధ్వంసకర, అరాచక పాలనను తమ సర్వీసులో ఎమర్జన్సీ సమయంలో కూడా చూడలేదన్నారు. అటువంటి ప్రభుత్వాన్ని ఓటు అనే ఆయుధంతో అంతమొందించి ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సీహెచ్. సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ దేశంలో రాష్ట్రం విద్యారంగంలో 23వ స్థానానికి పరిమితమైందని, ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ తీయలేదన్నారు. పీఆర్సీ అంటే పే రివిజన్ కమిషన్ అని, అయితే దానిని సీఎం జగన్ పే రెడ్యూసింగ్ కమిషన్‌గా మార్చేశారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఎన్జీవో సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు జి.పూర్ణచంద్రరావు, ఏపీ సచివాలయ సంఘం మాజీ అధ్యక్షుడు పి.గురవయ్య, ద్విసభ్య కమిటీ సభ్యుడు కంటమణి రామకృష్ణారావు, సూరపనేని చిన్ని, పెన్షనర్లు ఎన్‌వీకే సుబ్రహ్మణ్యం, జీబీవీ సుబ్రహ్మణ్యం, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రం ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ పింఛనుదారులు

రైల్వే స్టేషన్‌లో రూ.20కే భోజనం

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): వేసవి ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని రైల్వే తక్కువ ధరకే మినీ భోజనాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఎకానమీ, స్నాక్, కాంబో మీల్స్ పేరుతో విజయవాడ డివిజన్‌లోని 12 స్టేషన్లలో 23 కౌంటర్లలో తక్కువ ధరకు భోజనాన్ని అందిస్తున్నారు. జనరల్ బోగీల వద్ద కౌంటర్లు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఏడు పూరీలు(175గ్రాములు), డ్రై ఆలూ వెజ్(150గ్రా) లేదా 200గ్రా పెరుగు అన్నం/పులిహోరను రూ.20, ప్రాంతీయ రుచులకు సంబంధించిన 350గ్రా ఆహారాన్ని రూ.50కి విక్రయిస్తున్నారు. తక్కువ ధర అని నాసిరకం ఆహారం ఉండదని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో అందిస్తామని రైల్వే అధికారులు పేర్కొన్నారు. అయితే, ఈ తక్కువ ధర ఆహారం విక్రయించే చోట వేయింగ్ మిషన్‌ని అందుబాటులో ఉంచాలని ప్రయాణికులు సూచిస్తున్నారు. గతంలో జనతా భోజనం పేరుతో రూ.10కే అందుబాటులో ఉండడం గమనార్హం.

బీజేపీలో చేరిన నల్లమిల్లి

కూటమి అనపర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటన



రామకృష్ణారెడ్డిని బీజేపీలోకి ఆహ్వానిస్తున్న దృశ్యం

అనపర్తి, ఏప్రిల్ 23: అనపర్తి టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థిగా బీజేఈ తరఫున నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అభ్యర్థిత్వం ఖరారు చేస్తూ బీజేపీ ఢిల్లీ పెద్దలు ప్రకటించారు. మంగళవారం రాత్రి విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయానికి చేరుకున్న నల్లమిల్లి బీజేపీ ఏపీ ఎన్నికల సమన్వయకర్తలు సిద్ధార్థనాథ్ సింగ్, అరుణ్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరిలతో చర్చలు జరిపారు. అనంతరం రామకృష్ణారెడ్డికి కండువా కప్పి బీజేపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ అనపర్తి అసెంబ్లీ కూటమి అభ్యర్థిగా బీజేపీ తరపున రామకృష్ణారెడ్డి పోటీ చేస్తారని ప్రకటించి ఆయనకు పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాగా పొత్తులో భాగంగా మూడు పార్టీలు సీట్ల సర్దుబాట్లలో అనేక ఇబ్బందులు ఎదురుకావడంతో టీడీపీ అధినేత చంద్రబాబు సూచన మేరకు ఆయన బీజేపీలో చేరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. నల్లమిల్లి మాట్లాడుతూ జెండాలు వేరైనా మూడు పార్టీల అజెండా ఒకటేనని జగన్ రహిత రాష్ట్రంగా ఏపీని మార్చాలన్నదే తమ ధ్యేయమని, వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయఢంకా మోగిస్తారన్నారు.

పురందేశ్వరి జన్మదిన వేడుకలు

తాళ్లపూడి, ఏప్రిల్ 23: తాళ్లపూడిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి జన్మదిన వేడుకలను సోమవారం రాత్రి ఓబీసీ మోర్చా మండలాధ్యక్షుడు కలిశెట్టి సన్యాసినాయుడు స్వగృహంలో నిర్వహించారు. కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇండుగుల రామకృష్ణ, అయితం మణికంఠ, గోకవరపు జిత్రేం రవి, బవడారు నాగకుమారి, గంటా మణికంఠ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరీకి పసుపు కొమ్ములతో పూజలు



కొవ్వూరు, ఏప్రిల్ 23: కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో చైత్ర పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మంగళవారం ఆలయార్చకులు అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించి, సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు చేసి హనుమాన్ చాలీసా, లలితా సహస్రనామ పారాయణాలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ కార్యదర్శిగా ఈశ్వరరావు



గోపాలపురం, ఏప్రిల్ 23: తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం నియోజకవర్గం దేవరపల్లి మండలంలోని చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన పిన్నమనేని ఈశ్వరరావు టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆయన నియామక ఉత్తర్వులను అందుకున్నారు. పార్టీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టు సమయంలో హైదరాబాదులో నివసిస్తున్న ఆంధ్రులను చైతన్యవంతుల్ని చేసి లెస్‌మెట్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. కాగా చంద్రబాబు ఆదేశాల మేరకు హైదరాబాదులో ఉన్న ఆంధ్రా ఓటర్లను ఓటు వేయడానికి స్వగ్రామానికి వెళ్లేందుకు సంసిద్ధం చేసే పనిలో ఉన్నట్టు ఈశ్వరరావు తెలిపారు.

భావితరాల భవిష్యత్‌కు కూటమిని గెలిపించాలి

» టీడీపీ సీనియర్ నాయకుడు పెండ్యాల అచ్చిబాబు



కొవ్వూరులో టీడీపీలో చేరిన కార్యకర్తలతో అచ్చిబాబు తదితరులు

కొవ్వూరు, ఏప్రిల్ 23: భావితరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి పట్టం గట్టాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్చిబాబు పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. మంగళవారం కొవ్వూరు మండలం మద్దూరులంక గ్రామంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లుగా చేస్తున్న అరాచకపాలనను ప్రజలకు వివరించారు. అచ్చిబాబు మాట్లాడుతూ కూటమి విజయంతోనే రాష్ట్రానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. ఇదిలు ఉండగా కొవ్వూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ధర్మవరం గ్రామానికి చెందిన వెంపాటి సత్యనారాయణ, బండారు కామేశ్వరరావు, పోలిశెట్టి సత్యనారాయణ, యర్రా నాగేంద్రలు తమ అనుచరులతో టీడీపీలో చేరారు. వారందరికీ అచ్చిబాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలోకి కొత్తగా వచ్చిన వారిని కలుపుకుని అందరూ కలిసికట్టుగా పనిచేసి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నేరేడుమిల్లి నాగమణి, గారపాటి వెంకటకృష్ణ, కలగర గంగరావు, పేరిచర్ల శ్రీనివాసరాజు, పేరిచర్ల సూరిబాబు, ధర్మవరం బాబి పాల్గొన్నారు. కాగా దొమ్మేరులో ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి సుజాత ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ, మినీ మేనిఫెస్టో పథకాలను వివరించారు. రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు.

తాళ్లపూడి: మండలంలోని అన్నదేవరపేటలో టీడీపీ సీనియర్ నాయకుడు అల్లూరి విక్రమాదిత్య ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థిగా పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంలో పదో తరగతి పరీక్షల్లో మండలంలో ప్రథమ స్థానం సాధించిన హైస్కూల్ విద్యార్థిని కొనకళ్ల ఐశ్వర్యను అభినందించారు. కార్యక్రమంలో ఇంచరపు అబ్బులు, తొండెపు భరత్, ముళ్లపూడి గురి, కూచిపూడి నరేంద్ర తదితర నాయకులు పాల్గొన్నారు.

నలుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లు



నామినేషన్ అందజేస్తున్న బొంతా కిషోర్

కొవ్వూరు, ఏప్రిల్ 23: కొవ్వూరు అసెంబ్లీ నియోజకవర్గానికి నాలుగు నామినేషన్లు స్వీకరించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. స్వతంత్ర అభ్యర్థులుగా కొవ్వూరుకు చెందిన బొంతా కిషోర్, ఊబా శ్రీకాంత్, కిక్కిరిపాటి చినబాబు నామినేషన్ పత్రాలు మంగళవారం అందించారన్నారు. అలాగే మరో స్వతంత్ర అభ్యర్థి తోగుమ్మి గ్రామానికి చెందిన మొల్ల కమల రెండో సెట్ నామినేషన్‌ను అందజేశారన్నారు.

గోపాలపురం: గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థులుగా మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివజ్యోతి తెలిపారు. బీఎస్పీ అభ్యర్థిగా సిర్రా భరత్, కూటమి తరపున మద్దిపాటి వెంకట్రాజు, ఆయన తరపున పెనుమాక వినోదకుమారి, ఇండిపెండెంట్ అభ్యర్థిగా దొడ్డిగర్ల నాగార్జున నామినేషన్లు వేశారని చెప్పారు.

ప్రజలు మార్పును కోరుకుంటున్నారు

» కాంగ్రెస్ విజయం ఖాయం
» ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



కోరుకొండలో మీడియాతో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజానగరం/కోరుకొండ, ఏప్రిల్ 23: దేశంలోనూ, రాష్ట్రంలోనూ ప్రజలు మార్పును కోరుకుంటున్నారని, ఎంపీగా తాను, తన పరిధిలోని ఏడుగురు ఎమ్మెల్యేలు విజయం సాధించబోతున్నామని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. రాజానగరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ముంద్రు వెంకట శ్రీనివాస్ నామినేషన్ వేసేందుకు వెళ్లే ముందు మంగళవారం కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజుతో కలిసి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి దేవస్థానం నుంచి పాదయాత్రగా బయలుదేరారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద రుద్రరాజు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, తెలంగాణాలో అధికారంలోకి వచ్చిందని, దీంతో దేశ ప్రజలు సర్వమతాలకు సానుకూలంగా ఉండే కాంగ్రెస్ పట్ల ఆకర్శితులవుతున్నారని తెలిసిందన్నారు. ఏపీలో షర్మిళారెడ్డి నాయకత్వంలో 9 అద్భుతమైన పథకాలు అమలు చేయబోతుందన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే అద్భుతమైన పది పథకాలను అమలు చేయబోతున్నారన్నారు. అనంతరం ముంద్రు వెంకట శ్రీనివాస్ నామినేషన్ వేసేందుకు నరేంద్రపురం మీదుగా రాజానగరం చేరుకున్నారు. ఆపై పార్టీ కాంగ్రెస్ నాయకులతో కలిసి అక్కడి నుంచి చైతన్య రథంపై ఆర్‌వో కార్యాలయానికి చేరుకున్నారు. శ్రీనివాసు నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గరగ శ్రీధర్‌బాబు, కురెళ్ల గంగరాజు, కోరుకొండ సర్పంచ్ కర్రి వీరగణేష్ తదితరులు పాల్గొన్నారు.

క్వారీ గోతిలో నీటమునిగి బాలుడి మృతి



దేవరపల్లి, ఏప్రిల్ 23: ప్రమాదవశాత్తూ నీట మునిగి బాలుడి మృతి చెందాడు. దేవరపల్లి మండలం గౌరీపట్నం శివారులోని కొండగూడెం ప్రాంతంలోని వాడుకలో లేని కోడూరి వారికి చెందిన క్వారీలో వర్షపునీరు, కొండఊట కలిగిన గోతులో మునిగి గ్రామానికి చెందిన కుంచాల వెంకటేష్(13) మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. వెంకటేష్ గౌరీపట్నం ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. మధ్యాహ్నం స్కూల్ పూర్తయిన తరువాత 3గంటలకు కొండగూడెం ప్రాంతంలో ఉన్న క్వారీ గోతులోని నీటిలోకి స్నానానికి దిగి మునిగిపోయాడు. చుట్టుపక్కల ఉన్న వారు పైకి తీసుకొచ్చి 108వాహనంలో కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యాధికారులు నిర్ధారించారు. మృతుడి తండ్రి దుర్గారావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

దేవరపల్లి, ఏప్రిల్ 23: హోం మంత్రి ర్యాలీలో తీవ్ర గాయాలైన వృద్ధుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన పల్లపు అబ్బులు(73) ఈ నెల 19న హోం మంత్రి, నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తానేటి వనిత నామినేషన్ ర్యాలీలో పాల్గొన్నాడు. ద్విచక్ర వాహనంపై యర్నగూడెం నుంచి గోపాలపురం ర్యాలీగా వెళ్తుండగా దేవరపల్లి-కృష్ణంపాలెం జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కింద పడిపోయాడు. అతనికి తీవ్ర గాయాలవడంతో గోపాలపురం పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు. మృతదేహం మంగళవారం స్వగ్రామం చేరుకోగా కుటుంబ సభ్యులను హోం మంత్రి తానేటి వనిత పరామర్శించారు.

వడదెబ్బతో ఒకరి మృతి

చిడిపి గ్రామంలో ఘటన



కె.సుబ్బారావు (ఫైల్‌ఫొటో)

కొవ్వూరు, ఏప్రిల్ 23: కొవ్వూరు మండలం చిడిపి గ్రామానికి చెందిన కె.సుబ్బారావు(50) వడదెబ్బ తగిలి సోమవారం రాత్రి మృతిచెందాడని గ్రామస్థులు తెలిపారు. సుబ్బారావు ఆకుకూరలు అమ్ముతుంటాడు. అతడికి భార్య మార్తమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారికి పెళ్లిళ్ల అయిపోయాయి. ఇటీవల భార్య మార్తమ్మ బంధువుల ఇంటికి వెళ్లడంతో సుబ్బారావు ఒంటరిగానే ఉంటున్నాడు. సోమవారం ఆకుకూరల విత్తనాల కోసం తాళ్లపూడి మండలం పెద్దేవం వెళ్లి తిరిగి వచ్చిన సుబ్బారావు వడదెబ్బ తగిలి ఇంటి బయట మంచంపై పడుకున్నాడు. రాత్రి ఇంటి వద్ద లైట్లు వెలగడం లేదని చుట్టుప్రక్కల వాళ్లు వెళ్లి చూడగా మృతిచెంది ఉన్నాడు. వడదెబ్బ తగిలి సుబ్బారావు మృతి చెందాడని గ్రామస్థులు భావిస్తున్నారు.

వేంకటేశ్వరస్వామికి గరుడ సేవ

దేవరపల్లి, ఏప్రిల్ 23: దేవరపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం పౌర్ణమి సందర్భంగా గరుడ సేవ ఘనంగా నిర్వహించారు. కోలాట భజనలు, అన్నమయ్య సంకీర్తనలతో, ఊరేగించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వ గట్లు గుల్ల

» యథేచ్ఛగా మట్టి తవ్వకాలు
» ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

నల్లజర్ల, ఏప్రిల్ 23: మండలంలో మట్టి మాఫియా చెలారేగిపోతోంది. పోలవరం కుడి కాల్వ, ఎర్ర కాల్వ కుడి కాల్వ, తాడిపూడి కాల్వ గట్లును గుల్ల చేసేశారు. మంగళవారం కవులూరులో ఎర్రకాల్వ కుడి కాల్వ గట్టు తవ్వకాలు జరిపారు. దీనిపై ప్రక్క పొలానికి సంబంధించిన రైతు అల్లూరి వెంకట రామారావు ప్రశ్నించగా 'మా ఇష్టం ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో' అంటూ యథేచ్ఛగా మట్టి తరలించుకుపోయారు. రైతులు నడిచే మార్గాన్ని సైతం తవేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. గతంలో ఫిర్యాదు చేసినప్పటికీ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు పట్టించుకోలేదని రైతు చెబుతున్నాడు. పోలవరం కుడి కాల్వను ఇప్పటికే గుల్ల చేశారు. పోతవరం, సుభద్రపాలెంలో తాడిపూడి కుడి కాల్వ గట్టు, అనంతపల్లిలో పోలవరం కుడి కాల్వ గట్టు, గుండేపల్లిలో ఎర్ర కాల్వ గుట్టును దోచుకుపోయారు.



కవులూరులో ఎర్ర కాల్వ కుడి కాల్వ గట్టును ప్రొక్లెయినర్ ద్వారా తవ్వేస్తున్న దృశ్యం

చర్యలు తీసుకుంటాం

కవులూరులో ఎర్ర కాల్వ కుడి కాల్వ గట్టు తవేస్తున్నారని పోతవరానికి చెందిన అల్లూరి వెంకట రామారావు ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-భాస్కరరావు, ఎర్ర కాల్వ ఇరిగేషన్ ఏఈ.

మావుళ్లమ్మకు పౌర్ణమి పూజలు



తాళ్లపూడి, ఏప్రిల్ 23: మండలంలోని ప్రక్కిలంక గ్రామంలో మావుళ్లమ్మకు పౌర్ణమి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మంగళ వాయిద్యాలతో మహిళలు బిందెలతో గోదావరి నదీ జలాలు తీసుకు రాగా అమ్మవారికి అభిషేకం నిర్వహించి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్థానికుడు చెల్లెంకులు మూర్తిరాజు ఇత్తడి త్రిశూలాన్ని, అమర వాది మహదేవ్ చంద్రజ్యోతి దంపతులు రూ.10 వేల విలువైన డమరుకాన్ని లొల్ల గ్రామానికి చెందిన వరప్రసాద్ రూ.25 వేలు విలువైన మైకొసెట్‌ను అందించారని ఆలయ కమిటీ తెలిపింది. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ముళ్ల మల్లిబాబు, ఖండవల్లి రామచంద్రం, లద్దిక నాగు, కలిశెట్టి రవి, పట్నాల సతీష్, పెంటా శ్రీను, ముళ్ల రాజశేఖర్ పాల్గొన్నారు.

6 నామినేషన్లు దాఖలు

రాజానగరం, ఏప్రిల్ 23: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా మంగళవారం రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నలుగురు అభ్యర్థులు 6 నామినేషన్లు దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున ముంద్రు వెంకట శ్రీనివాస్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. భారత చైతన్య యువజన పార్టీ తరపున జక్కంపూడి సత్తిబాబు, స్వతంత్ర అభ్యర్థిగా కుసుమే గాంధీ నామినేషన్లు దాఖలు చేశారు. అలాగే బత్తుల బలరామకృష్ణ నవరంగ్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక నామినేషన్, స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ దాఖలు చేశారు. ఈమేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి అభ్యర్థుల నుంచి నామినేషన్ పత్రాలను స్వీకరించారు.